నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

మెదక్

1

ఆదివారం | 12 జనవరి 2025 | www.navatelangana.com

ప్రజాగొంతుకను నిర్భయంగా వినిపించిదే "నవతెలంగాణ "

తాజామాజీ జడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్త.

నవతెలంగాణ-శివ్వంపేట



అక్రమాలు, అన్యాయాలను, పేద ప్రజల సమస్యలను ప్రజాగొంతుకగా నిర్భయంగా వినిపించిదే నవతెలంగాణ పత్రిక అని జిల్లా ఆర్థిక, ప్రణాళిక సంఘం మాజీ సభ్యులు, శివ్వంపేట మాజీ జడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్త అన్నారు. మండల రిపోర్టర్ బాలేష్ తో కలిసి శనివారం నవతెలంగాణ నూతన క్యాలెండర్‌ను శివ్వంపేటలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహేష్ గుప్త మాట్లాడుతూ ప్రతి అక్రమాన్ని వెలికితీసి, అధికారుల దృష్టికి ప్రజా సమస్యలను తీసుకెళ్లి పరిష్కారం చేసేలా నవతెలంగాణ పత్రిక ఎన్నో కథనాలను ప్రచురరించి పేద ప్రజల పక్షాన నిలబడుతోందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు దొడ్ల అశోక్, పత్రాల దేవేందర్ గౌడ్, కోవూరి వెంకటేష్, కొత్తపేట శ్రీనివాస్ గౌడ్, పత్రాల త్రినేష్, వజ్జ హరీష్, శ్యామ్, ఖదీర్, మగ్దుం అలీ,తదితరులు పాల్గొన్నారు.

ప్రతిక్షణం ప్రజల పక్షం 'నవతెలంగాణ'

- బీసీ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

నవతెలంగాణ-అక్కన్నపేట



ప్రతిక్షణం ప్రజల పక్షాన ఉంటూ, ప్రజా సమస్యలను వెలికి తీస్తున్న నవతెలంగాణ ముందుకు సాగాలని అన్నారు. నవ తెలంగాణ 2025 క్యాలెండర్‌ను శనివారం అక్కన్నపేట రిపోర్టర్ మోహన్ బాబు ఆధ్వర్యంలో బీసీ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవిష్కరించారు. ఇలాగే ప్రజల పక్షాన ఉంటూ సమాజంలో మరింత ముందుకు ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

భూములు మింగి... కహానీలా....!





నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

పేద గిరిజన రైతులు ఎన్నో ఏళ్లుగా సాగుచేసుకుంటున్న భూముల్ని మింగింది చాలక గ్రీన్ మార్క్ కంపెనీ ప్రతినిధులు కట్టుకథలతో కహానీలు చెప్పడం దొంగే దొంగా దొంగ అన్నట్లుంది. రామచంద్రాపురంలో మిగులు భూముల్ని మింగి వందల కోట్ల వ్యాపారం సాగించే కుట్రలు సాగకపోయే సరికి సేల్ డీడ్స్, రెండు జిల్లాల సరిహద్దుల నిర్ధారణంటూ కట్టుకథలు చెప్పినంత మాత్రాన చేసిన తప్పులు పోవు కథా..! రామచంద్రాపురం మండలంలోని వెలిమల గ్రామంలో గ్రీన్ మార్క్ ప్రయివేట్ లిమిటెడ్ ప్రతినిధులు మీడియా ముందు చెప్పిన వివరాలేవీ పొంతలేకపోవడంతోనే వారి భూ దందా అర్థమవుతోంది. జీవనాధారమైన భూములు కోల్పోయిన గిరిజన రైతులు మాత్రం తమ భూములు తమకే కావాలంటూ కన్నీటి పర్యంతమవుతున్నారు. రెవెన్యూ ఉన్నతాధికారులు, రియల్టర్లు కలిసి సాగించిన భూ మాయ లోగుట్టు వెనకాల పెద్ద ఎత్తున ముడుపుల వ్యవహారం నడిచినట్లు తెలుస్తోంది.

రామచంద్రాపురం పరిధిలోని వెలిమల గ్రామ రెవెన్యూ పరిధిలో 88 ఎకరాల "బిల్లా దాకాల" మిగులు భూములున్నాయి. గత 80 ఏళ్ల నుంచి ఆ ప్రాంతంలోని గిరిజన రైతులు అట్టి భూముల్ని సాగు చేసుకుని జీవితాల్ని సాగిస్తున్నారు. భూమే ఆధారంగా వారి కుటుంబాలు జీవనాధారం పొందుతున్నాయి. అక్కడి భూముల విలువ అమాంతం పెరిగే సరికి పేదల భూములపై పెద్దల కన్ను పడింది. రంగారెడ్డి, సంగారెడ్డి రెండు జిల్లాల సరిహద్దు శివారు గ్రామాల పరిధిలోని భూములు కావడంతో బౌండరీలు ఫిక్స్ చేసే నెపంతో రైతులకు చెందిన మిగులు భూముల్ని రెవెన్యూ అధికారులు రియల్టర్లకు పట్టా చేయడంతో మిగులు భూములు మాయమయ్యాయని స్థానిక రైతులు చెబుతున్నారు. నిత్యానందరెడ్డి, కళ్యాణ్‌రెడ్డి, విక్రంకుమార్‌రెడ్డిలు పేదల భూముల్ని కబ్జా చేసిందే కాకుండా గోడ కట్టారు. వెలిమల మిగులు భూముల వ్యవహారంలో ఎంతో కాలంగా వివాదం నడుస్తుంది. ఇటీవల జాతీయ స్థాయి ఎస్టీ కమిషన్ దృష్టికి భూముల కబ్జా విషయాలు వెళ్లడంతో మరో సారి చర్చనీయాంశమైంది.

- మిగులు భూములు కాజేసిన గ్రీన్‌మార్క్
- ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించిన గిరిజన రైతులు
- విచారణకు... ఆర్డీఓ, తహసీల్దార్ హాజరు
- అయినా రైతులకు న్యాయం చేయని వైనం
- తప్పుడు సేల్ డీడ్స్ పేర కంపెనీ ప్రతినిధుల కథలు
- గుడ్డిగా పేదల భూముల్ని కట్టబెట్టిన రెవెన్యూ లీలలు
- న్యాయం జరిగే వరకు పోరాటం:సీపీఐ(ఎం)

జాతీయ ఎస్టీ కమిషన్ చెప్పినా వినని వైనం

వెలిమల గ్రామంలోని బిల్లా దాకాల మిగులు భూములు అన్యాక్రాంతమైన విషయాన్ని బాధిత రైతులు జాతీయ ఎస్టీ కమిషన్ దృష్టికి గతంలోనే తీసుకెళ్లారు. తమకు జరిగిన అన్యాయాన్ని కమిషన్‌కు విన్నవించారు. రెవెన్యూ ఉన్నతాధికారులు, రియల్టర్లు కలిసి తమ భూముల్ని ఏ విధంగా పట్టా మార్పిడది చేసుకున్నారన్న విషయాల్ని కమిషన్ వద్ద ఉంచడంతో సమస్య మరో మలుపు తిరిగింది. తాజాగా సంగారెడ్డి ఆర్డీఓ రవిందర్‌రెడ్డి, రామచంద్రాపురం తహసీల్దార్ సంగ్రాంరెడ్డి ఇద్దర్ని సైతం కమిషన్ ఎదుట హాజరుకావాలని చెప్పడంతో వారు విచారణకు వెళ్లారు. గతంలోనూ కమిషన్ రైతులు, అధికారుల్ని ఢిల్లికి పిలిపించి మాట్లాడింది. తాజాగా మరో సారి విచారణ జరగడంతో ఇకనైనా న్యాయం జరగాలని రైతులు కోరుతున్నారు. బిల్లా దాకాల భూముల్ని గ్రీన్‌మార్క్ సంస్థ అక్రమ పద్ధతిలో పట్టా చేయించుకున్న తీరును క్షణంగా కమిషన్ దృష్టికి తీసుకెళ్లినందున కమిషన్ సైతం అధికారుల పట్ల ఆగ్రహం వ్యక్తం చేసినట్లు చెబుతున్నారు. భూముల వ్యవహారంలో అధికారుల తప్పిదాలు ఉన్నట్లు తేలితే అందరిపైన కఠిన చర్యలు తప్పవని కమిషన్ హెచ్చరించడం చర్చనీయాంశమైంది.

గ్రీన్ మార్క్ ప్రతినిధుల పిట్ట కథలు

వెలిమల గ్రామంలోని బిల్లాదకాల భూములే లేవంటూ గ్రీన్ మార్క్ ప్రయివేట్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులమని పలువురు మీడియా ముందుకొచ్చారు. భూముల స్వభావం, లిటిగేషన్స్, ఆగడాలు చెబుతామంటూ అందరి చెవిలో పూలు పెట్టే ప్రయత్నం చేశారు. పట్టా భూముల్ని 150 ఎకరాల వరకు కొనుగోలు చేశామని చెప్పారు. రంగారెడ్డి జిల్లా శంకరంపేట మండలంలోని కొండకల్ శివారులో భూములన్నాయని పేర్కొన్నారు. రంగారెడ్డి సంగారెడ్డి జిల్లా బౌండరీలు పిక్స్ చేసిన తర్వాత తమ సంస్థకు ఉండాల్సిన భూమి లేకపోవడంతో దరఖాస్తు చేసుకున్నట్లు వివరించారు. అందుకు అధికారులు 26.25 ఎకరాల భూములకు పట్టా ఇచ్చినట్లు తెలిపారు. ఆ భూములు ఎవరి నుంచి బదలాయించ బడ్డాయనే వివరాల్ని మాత్రం ప్రతినిధులెవ్వరూ చెప్పలేకపోయారు. తమకు భూమి తక్కువగా ఉందని చెప్పగానే అధికారులు సర్వే చేసి మిగులు భూముల్ని పట్టా చేసి ఇవ్వడం అంతా చకా చకా జరిగిపోవడం వెనకాల ఏం జరిగిందో చెప్పట్లేదు. 2006లో భూములు కొన్నామంటున్నారు. 326లో 15 ఎకరాలు, 327లో 19.11 ఎకరాల భూముల్ని వెలిమలలో కొన్నట్లు చూపుతున్నారు. పట్టా భూముల్నే తమ పేరిట పట్టా చేసినట్లు అయితే ఆ ఊరిలో ఉండాల్సిన బిల్లాదాకాల మిగులు భూములు ఎక్కడికి వెళ్లాయో కంపెనీ ప్రతినిధులే చెప్పాలి..? కంపెనీకి భూములు తక్కువ ఉన్నాయని కోరగానే 26 ఎకరాల్ని పట్టా చేసిన అధికారులు తమ భూముల్లేకుండా పోయాయని కన్నీరు పెడుతున్న గిరిజన రైతులకు మాత్రం సెంటు భూమిని చూపేందుకు అధికారులు ముందుకు రాకపోవడం

రైతులకు న్యాయం చేయాలి:

కె.రాజయ్య , సీపీఐఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు



వెలిమల గిరిజన రైతులకు న్యాయం చేయాలి. వారి భూముల్ని తిరిగి అప్పజెప్పాలి. అధికారులు తప్పుడు పద్ధతుల్లో రియల్టర్లకు భూముల్ని కట్టబెట్టినట్లు ఆరోపణలున్నాయి. కంపెనీ చెప్పేవన్నీ అబద్ధాలుగా తేలుతుంది. ఏళ్ల తరబడిగా సాగు చేసుకుంటున్న భూముల్ని గుంజుకోవడం అన్యాయం. రైతరులకు న్యాయం జరిగే వరకు సీపీఐఎం అండగా నిలుస్తుంది.

హుస్నాబాద్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా..!

-నియోజకవర్గంలో నీటి సమస్య ఉండొద్దు

-పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

-కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం హుస్నాబాద్ పట్టణంలో పలు వార్డుల్లో అభివృద్ధి కార్యక్రమాల పనులకు శంకుస్థాపన ,కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నియోజవర్గం లో ఒక బిందె నీళ్లకు బయటకు వచ్చి నిరసనలు ఉండకూడదని, గత ఏడాది కూడా ముందే మంచినీటి సమస్య లేకుండా ప్లాన్ చేశామన్నారు. నియోజకవర్గంలో ఎలాంటి సమస్య లేకుండా ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు. ముంపు బాధితుల సమస్యలు తెలుసని మేము లోయర్ మనేర్ డాం నిర్వసితులేం విలువైన భూమిని అప్పుడు రూ.1800 లకి ఎకరం ఇచ్చామన్నారు. సమస్యలు ఏమున్నా మార్చి తరువాత అన్ని పరిష్కారం చేస్తాం అది నా బాధ్యత అన్నారు. పట్టణంలో 20 వార్డుల్లో రోడ్లు, మురికి కాలువల నిర్మాణానికి రూ.50 లక్షలు చొప్పున ఇస్తున్నామన్నారు. పది మహిళ సంఘాలకు రూ.45 లక్షల చొప్పున ఇచ్చామన్నారు. హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు కట్ట



సుందరీకరణ అభివృద్ధికి శంఖు స్థాపన చేసుకున్నామని చెప్పారు. మహిళలకు ఆర్థిక వృద్ధి సాధించడానికి కొన్ని ఇంట్లో కూర్చొని చేసే పనులు ఉన్నాయన్నారు. సెట్విన్ శిక్షణ కేంద్రాన్ని పరిశీలించి ఆసక్తి ఉన్నవారు శిక్షణ తీసుకోవలన్నారు. మెప్మా ద్వారా మీకు ఏ పథకాలు ఉన్నాయనేది చూస్తారన్నారు. ఆర్థికంగా వెసులుబాటు ఉండే కార్యక్రమాలు చేపడతమన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ లింగమూర్తి, హుస్నాబాద్ మున్సిపల్ చైర్మెన్ ఆకుల రజిత వెంకన్న, సింగిల్ విండో చైర్మెన్ బొలిశెట్టి శివయ్య, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మెన్ తిరుపతి రెడ్డి, వైస్ చైర్మెన్ బంక చందు, ఆర్డీవో రామ్మూర్తి, తహసీల్దార్ రవీందర్ రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాడేది ఎర్రజెండానే

నవతెలంగాణ-కొండాపూర్



ప్రజా సమస్యలపై పోరాడేది ఎర్రజెండానే అని.. సమ స్యల పరిష్కారం కోసం సీపీఐ(ఎం) నిరంతరం సమరశీల పోరాటాలు చేస్తున్నదని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యు లు ఎం.నర్సింలు అన్నారు. మండలంలోని సీహెచ్ కోనాపూ ర్‌లో శనివారం ఇంటింటికీ సీపీఐ(ఎం) విరాళాల కార్యక్ర మాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాలక పార్టీలు ఎన్నికల సందర్భంగా ఎన్నో వాగ్దానాలు చేసి.. గద్దెనెక్కిన తర్వాత అన్ని మర్చిపోతున్నా రన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, రైతు, ఉద్యోగ, ప్రజా వ్యతిరేక విధానాలని అవలంభిస్తున్నదన్నారు. అంబానీ, ఆదాని లాంటి కార్పొరేట్లకు ధనికులకు ఊడిగం చేస్తున్నద న్నారు. ప్రభుత్వంపై వస్తున్న సంతృప్తిని సైడ్ చేయడం కోసం మతోన్మాద ఎజెండాను అమలు చేస్తున్నదని మండి పడ్డారు. నిత్యవసర సరుకులు ధరలు రోజురోజుకు పెద్దఎ త్తున పెంచి సామాన్య ప్రజల పై భారాలు వేస్తున్నదన్నారు. రాజ్యాంగంపై, ప్రజాస్వామ్యం, లౌకిక విలువలపై దాడి చేసు_న్నదన్నారు. వాటిని ప్రజలు ఐక్యంగా తింపి కొట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలకు అండగా సీపీఐ(ఎం) ఎర్రజెండా ఉంటదన్నారు. పార్టీ కొండాపూర్ మండల కార్య దర్శికే. రాజయ్య మాట్లాడుతూ.. పేదల భూములు గుంజు కొని పెద్దలకు అప్పచెబుతు న్నారన్నారు. ధరణిలో పేదల అసైనె ్మంట్ భూములకు నేటికీ అనేక గ్రామాలలో పట్టా పాస్ పుస్తకాలు రాలేదన్నారు. పేదలకు భూములు పంచింది ఇళ్ల స్థలా ల కోసం పోరాడింది కమ్యూనిస్టుల ఎర్రజెండానే అన్నా ్నరు. కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున ్నద న్నారు. అలాంటి పార్టీకి సంబంధించిన రాష్ట్ర మహాసభలు ఈనెల 25 నుంచి 28 వరకు జరగనున్నాయని.. ప్రజలు పెద్ద ఎత్తు న పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్ర మంలో కరుణమ్మ, శాంతమ్మ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బాలుడి ప్రాణం తీసిన గాలిపటం

రోడ్డుపైన పడిన గాలిపటాన్ని తీయబోతుండగా ఢీకొట్టిన ట్రాక్టర్

నవతెలంగాణ-జోగిపేట



తెగిన గాలిపటం ఒక బాలుడు ప్రాణం తీసింది. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా జోగిపేట పట్టణంలో సాయంత్రం జరిగింది. జోగిపేట ఎస్సై పాండు తెలిపిన వివరాల ప్రకారం.. జోగిపేట బస్టాండ్ వద్దగల 161 జాతీయ రహదారి పై సుమారు ఏడేండ్ల ఉన్న ఓ బాలుడు తన స్నేహితులతో కలిసి గాలిపటాలను చేతిలో పట్టుకొని వస్తుండగా.. రోడు పై ఓ తెగిన గాలిపటం ఉండడం కనిపించింది. వెంటనే బాలుడు ఆ గాలిపటాన్ని తీసుకోవడానికి రోడ్డుపైకి వెళ్లగా.. అటుపైపు నుంచి వస్తున్న ట్రాక్టర్ బలంగా ఢీకొట్టింది. తీవ్రగాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. బాలుడి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

బాధిత కుటుంబానికి బాల్‌రెడ్డి పరామర్శ

నవతెలంగాణ-జిన్నారం



మండలంలోని పెద్దమ్మ గూడెం గ్రామానికి చెందిన అత్మ కమిటీ డైరెక్టర్ దుబ్బాక మహేష్ తండ్రి యాదయ్య మృతి చెందారు. ఈ విషయం తెల్సుకుని మాజీ జెడ్పిటిసి కొలను బాల్ రెడ్డి శనివారం సదరు కుటుంబాన్ని పరామర్శించి ధైర్యంగా ఉండాలని భరోసాని ఇచ్చారు. ఆయన వెంట బీఆర్ఎస్ రాష్ట్ర నేత జి వెంకటేశం గౌడ్, స్థానిక నాయకులు శ్రీనివాస్ రెడ్డి, బురెడ్డిగారి బోజిరెడ్డి, నరసింహారెడ్డి, శ్రీకాంత్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, మోహన్,శ్రీనివాస్ యాదవ్, యాదయ్య ఎల్లేష్ రాములు, మహేష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు

లారీ, స్కూటీ ఢీ..

తండ్రి మృతి, కొడుకుకు తీవ్రగాయాలు

నవతెలంగాణ-పటాన్‌చెరు



వేగంగా వస్తున్న లారీ స్కూటీని ఢీకొట్టడంతో తండ్రి మృతి చెందగా.. కొడుకుకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలంలోని బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి జరిగింది. బీడీఎల్ బానూర్ సీఐ స్వామి గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లికి చెందిన అశోక్(45), తన కుమారుడు మని సంకిత్‌తో కలిసి రాత్రి ఏడున్నర గంటల సమయంలో స్కూటీపై పటాన్‌చెరు వైపు వస్తున్నాడు. పటాన్‌చెరు మండలం నందిగామ గ్రామ శివార్‌లోని నారాయణ స్కూల్ వద్దకు రాగానే.. ఎదురుగా పటాన్‌చెరు వైపు నుంచి శంకర్‌పల్లి వైపు వస్తున్న లారీ వారి స్కూటీని బలంగా ఢీకొట్టింది. తీవ్ర గాయాలు కావడంతో.. అశోక్ అక్కడిక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన మనీ సంకిత్‌ను చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. అశోక్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

న్యూ ఎడ్యుకేషన్ పాలసీ 20-20ని రద్దు చేయాలి

నవతెలంగాణ-సంగారెడ్డి

న్యూ ఎడ్యుకేషన్ పాలసీ 20-20ను రద్దు చేయాలని.. కేజీబీవీ, యూఆర్ఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులకు బేసిక్ పే ఇవ్వాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి టి.లక్ష్మారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వై. జ్ఞాన మంజరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సంగారెడ్డి జిల్లా ఆఫీసు బేరర్స్ సమావేశాన్ని శనివారం జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎన్ఈ పి-20-20ని వెంటనే రద్దు చేయాలన్నారు. ఆ విధానం ద్వారా విద్యారంగం కేంద్రీకరణ, ప్రైవేటీకరణ, కార్పొరేట కరణ, కాషాయీకరణకు దారి తీస్తుందన్నారు. మొత్తం విద్యావ్యవస్థకే ప్రమాదకరంగా మారుతున్నదన్నారు. భవిష్యత్ తరానికి విద్యారంగమే పునాదిగా ఉండాల్సిన సమయంలో ఫెడరల్ స్ఫూర్తితో భారత రాజ్యాంగాన్ని ఇనుముడింప చేయాల్సిన ఎడ్యుకేషన్ పాలసీ రాజ్యాంగ మౌలిక సూత్రాలైన ప్రజాస్వామ్యం, సామ్యవాద, లౌకిక తత్వం లకు విరుద్ధంగా రూపొందించడం, దాన్ని అమల్లోకి తీసుకు రావడం చాలా విచారించదగ్గ విషయమన్నారు. దాన్ని విద్యావంతులు, మేధావులు ఖండిస్తున్నారని ఇలాంటి ఒంటెద్దు పోకడల ధోరణితో ఫెడరల్ విధానానికి విరుద్ధంగా రూపొందించబడ్డ పాలసీని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమ్మె చేసిన సర్వ శిక్ష ఉద్యోగులు, కేజీబీవీ, యుఆర్ఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులకు బేసిక్ పే ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు కనుగుణంగా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాల్సిన అవసరం ఉండగా.. ఎంతో శ్రమతో రాత్రింబవళ్లు బాలికలకు విద్యను అందిస్తూ తక్కువ జీతాలతో ఎక్కువ శ్రమ పడుతున్న వారికి బేసిక్ పే ఇవ్వడం అత్యంత అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కే.అశోక్, ప్రధాన కార్యదర్శి బి.సాయిలు, ఉపాధ్యక్షులు జె.కాశీనాథ్, ఎం.సువర్ణ, కోశాధికారి పి.శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శిలు బి.అరుణ శ్రీ, ఎం.అమరేశ్వరి, ఎం.శామయ్య, బి.సాయి తేజ తదితరులు పాల్గొన్నారు. .



టోల్ ప్లాజాకు సంక్రాంతి తాకిడి, భారీగా ట్రాఫిక్ జామ్

నవతెలంగాణ-తూప్రాన్



తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలోని అల్లాపూర్ వద్ద ఉన్న టోల్ ప్లాజాకు సంక్రాంతి తాకిడి ఒకసారిగా పెరిగిపోయింది. సంక్రాంతి సెలవులతో ప్రభుత్వ, ప్రైవేటు, ఉద్యోగులు, విద్యార్థులు కార్లలో, బస్సులలో కిక్కిరిసి ప్రయాణికులు హైదరాబాద్ నుంచి నిజామాబాద్, మెదక్, కామారెడ్డి, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలలోని స్వస్థలాలకు సంక్రాంతి పండుగ సందర్భంగా సొంత గ్రామాలకు భారీ స్థాయిలో వెళుతున్నారు. అందువలన టోల్ ప్లాజా వద్ద భారీ స్థాయిలో వాహనాలు ట్రాఫిక్ జామ్ కలిగింది. మరో రెండు రోజుల్లో ఇంకా భారీ స్థాయిలో ట్రాఫిక్ జామ్ తిరగనున్నట్లు స్థానికులు తెలిపారు. దీంతో టోల్ ప్లాజా వద్ద వాహనాల రద్దీ పెరగడంతో టోల్ టాక్స్ భారీ స్థాయిలో రానున్నట్లు తెలుస్తోంది...

ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్లు సస్పెండ్

రూ.5,66,849 రికవరీ, 76 వేలు జరిమానా

నవతెలంగాణ-కౌడిపల్లి



మండల కేంద్రమైన కౌడిపల్లిలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం విడత సామాజిక తనిఖీ నిర్వహించారు. శనివారం ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడుతూ కౌడిపల్లి మండలం ధర్మసాగర్ ఫీల్డ్ అసిస్టెంట్ మల్లేశం, వెల్మ కన్నా గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ ముత్తయ్యలు ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు జరిపినట్లు విచారణలో తేలడంతో ఇద్దరినీ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేసినట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు జరిపి రూ.5,66,849లు రికవరీ చేయగా రూ76 వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. ఉపాధి హామీ పనుల్లో అవకతవకలకు పాల్పడిన ఫీల్డ్ అసిస్టెంట్లు, టి ఏ లు, ఏపీఓకు సైతం మెమోలు ఇచ్చే అవకాశం ఉందని పూర్తి వివరాలు వచ్చాక నివేదిస్తామన్నారు.

నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మంత్రి

వతెలంగాణ-సిద్దిపేట



రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎస్ఆర్ఐ గాడిపల్లి రఘువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనేక సామాజిక సేవలు చేస్తూ, ప్రజా క్షేత్రంలో మంచి నాయకుడిగా వ్యవహరిస్తూనే, గాడిపల్లి ఫాండేషన్ స్థాపించి, ప్రజల సమస్యలను వెలుగులోకి తేవడంతో పాటు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ముఖ్య పాత్ర పోషిస్తున్నారని అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా కోకన్వీనర్ సామాన్ల సంతోష్ కుమార్, రంగరాజాం, సాయి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతో వారికి సంబంధం లేదు

నవతెలంగాణ-సిద్ధిపేట

సిద్దిపేట కాంగ్రెస్ నాయకులపై ఒక యూట్యూబ్ ఛానల్ వేదికగా అభియోగాలు మోపిన సోహెల్ కు, చంద్రశేఖర్‌కు కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు లక్ష్మి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వాహబ్, రాష్ట్ర మైనార్టీ నాయకులు కలిముద్దీన్ అన్నారు. సిద్దిపేట కేంద్రంలోని కాంగ్రెస్ క్యాంప్ కార్యాల యంలో విలేకరులతో కాంగ్రెస్ నాయకులు మాట్లాడారు. గతంలో ఎన్నో కేసులతో సంబంధం ఉన్న సోహెల్ పై రౌడీ షీట్ ఓపెన్ చేయడానికి, తల్లిని చంపిన కేసులో అరెస్టు అయిన చంద్రశేఖర్ కేసు తవ్వడానికి పూజల హరికృష్ణకు సంబంధం ఏమిటని ప్రశ్నించారు. మరొకసారి సిద్దిపేట కాంగ్రెస్ నాయకులపై గాని, పార్టీ పై గాని అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని అన్నారు. వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని రాష్ట్ర, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులను కోరినట్లు తెలిపారు. పార్టీలో ఉంటూ పార్టీని విమర్శించే వారు పార్టీకి అక్కర్లేదని అన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు గయాసుద్దీన్, అజ్మత్, పద్మ ,అంజయ్య, రజిని, సన, వనజ పాల్గొన్నారు.



ఉచిత వైద్య శిబిరం నిర్వాహణ అభినందనీయం

నవతెలంగాణ-మనూర్



మారుమూల ప్రాంతంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయం అని మాజీ జిల్లా ప్రణాళిక సభ్యులు నగేష్ శెట్కార్ అన్నారు. నాగలిగిద్దా మండలంలోని కారసగుత్తి గ్రామంలో రాష్ట్ర అంబెద్కర్ పూలె సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతం ప్రజలకు వైద్యం పైన అవగాహన పెరుగుతున్నదన్నారు. ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసిన సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్ర మం విజయవంతం చేసిన వారికీ పూలె సేవ సమితి అధ్యక్షులు రహీమ్ ధన్యవాదాలు చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు నారాయణ జాదవ్ పండరినాథ్ రావు, రూపీసింగ్ సేవా సమితి బాధ్యులు పండరి కృష్ణ, వైద్య సిబ్బంది, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

పద్మశాలి సేవా సమాజం క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-సదాశివపేట



సదాశివపేట పట్టణంలోని స్థానిక చేనేత సహకార సంఘం భవనంలో శనివారం పద్మశాలి సేవా సమాజం క్యాలెండర్‌ను ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ శనివారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పద్మశాలీల ఐక్యతతో కలిసిమెలిసి ఉండాలని కోరారు. అదేవిధంగా అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శివరాజ్ పాటిల్, మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్, మాజీ కౌన్సిలర్ సాతాని శ్రీశైలం, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శ్రీధర్ రెడ్డి, మాజీ సర్పంచ్ పద్మ దుర్గయ్య, రాష్ట్ర పద్మశాలి సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ సీతా వైద్యం కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి ఆత్మహత్య



(ఫైల్)

నవతెలంగాణ-జోగిపేట

మతిస్థిమితం సరిగ్గా లేని ఓ వ్యక్తి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్య చేసుకున్న సంఘటన జోగిపేట పట్టణంలో శనివారం జరిగింది. జోగిపేట ఎస్సై పాండు తెలిపిన వివరాల ప్రకారం.. జోగిపేట పట్టణానికి చెందిన నర్రా రాజశేఖర్(30) అనే వ్యక్తి గత వారం రోజులుగా మతిస్థిమితం సరిగ్గా లేకుండా వ్యవహరిస్తున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. శనివారం మృతుడి భార్య మమత కూలి పనికి వెళ్లగా మధ్యాహ్నం ఎవరూ లేని సమయంలో ఇంట్లోకి వెళ్లి తలుపులు పెట్టుకొని ఉరి వేసుకున్నాడు. సాయంత్రం కుటుంబ సభ్యులు ఇంటికి వచ్చి చూడగా విగతజీవిగా కనిపించాడు. వెంటనే జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీలో భద్రపర్చినట్టు ఎస్ఐ చెప్పారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామన్నారు.

మోతే మాత జాతరకు సర్వం సిద్ధం

నేటి నుంచే ప్రారంభం.. రెండ్రోజుల పాటు ఘనంగా ఉత్సవాలు



- తెలంగాణలోనే రెండో అతిపెద్ద గిరిజన జాతరగా ప్రఖ్యాతి
- అధికారికంగా నిర్వహిస్తున్న ప్రభుత్వం

నవతెలంగాణ-జహీరాబాద్

రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద గిరిజన జాతరగా పేరొందిన మోతీమాత జాతరకు సర్వ సిద్ధమైంది. వివిధ శాఖల అధికారులతో పాటు ఆ ప్రాంత గిరిజనులు పెద్ద సంఖ్యలో హాజరై ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తుల కు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నారు.

సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలంలోని పర్వతాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో గల మోతీమాత జాతర నేడు(ఆదివారం) ప్రారంభమై, రేపటితో(12, 13తేదీల్లో) ముగియనున్నది. వివిధ తాండాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో జెండాలను ఊరేగింపుగా తీసుకొని మందిరం వద్దకు వచ్చి తమ మొక్కులను చెల్లించుకుంటారు. ఈ జాతరకు కర్నాటక, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో గిరిజనులు హాజరుకా నున్నా రు. దాంతో ఆలయ ప్రాంగణం మొత్తం చుట్టూ ఐదు కిలోమీటర్ల వరకు జనాలతో కిక్కిరిసిపోతుంది.

జాతర వద్ద వివిధ శాఖల సమన్వయంతో అన్ని ఏర్పాట్లను ఆర్డీవో రామ్‌రెడ్డి పర్యవేక్షణలో ముమ్మర చేపడుతున్నారు. ఈ సంవత్సరం సుమారు రెండు లక్షల వరకు భక్తులు హాజరవుతారని ఆలయ కమిటీ సభ్యులు అధ్యక్షులు కేశవ్ నాయక్ తెలిపారు. వర్షా ఆధారిత పంటలన్నీ ఇప్పటికే కోతకు వచ్చి మార్కెట్లకు తరలించినందున గిరిజనులు తమ మొక్కులను చెల్లించుకునేందుకు ఈయేడు భారీ సంఖ్యలో హాజరవుతు న్నారన్నారు. గతేడాది అధికారికంగా జాతర రెండ్రోజులు కొనసాగినప్పటికీ వారం రోజులపాటు భక్తులు వచ్చి తమ మొక్కులను చెల్లించుకుంటూనే ఉంటారన్నారు. గతేడాది 1.50 లక్షలమంది భక్తులు తమ మొక్కులను చెల్లించుకు న్నారన్నారు. నేడు జాతర జెండా ప్రారంభమై 13వ తేదీన మొక్కుల చెల్లింపుతో ముగుస్తుందని కమిటీ సభ్యులు తెలిపారు.

హాజరుకానున్న మంత్రి..

13వ తేదీన మంత్రి దామోదర్ రాజనర్సింహతో పాటు జిల్లా కలెక్టర్ స్థానిక ప్రజాప్రతినిధులు హాజరుకానున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు కేశవ్ సింగ్ తెలిపారు.

నేటికీ రాని హెల్త్ సబ్ సెంటర్ అనుమతులు..

గతేడాది జాతరలో పాల్గొన్న మంత్రి దామోదర్ రాజనర్సింహ మందిర ప్రాంగణ ప్రాంతంలో హెల్త్ సబ్ సెంటర్‌ను ఏర్పాటుకు మరమ్మతులు చేస్తున్నామని.. కొబ్బరికాయ కొట్టి భూమి పూజ సైతం చేశారు. మంత్రి భూమి పూజ చేసి సంవత్సరం పూర్తయినప్పటికీ నేటికీ సబ్‌సెంటర్ ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ కాకపోవడంతో గిరిజనుల్లో నిరాశ నెలకొంది.



వెల్టూరులో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

నవతెలంగాణ-సదాశివపేట

మండల పరిధిలో గల వెల్టూర్ గ్రామంలో కీర్తిశేషులు పబ్బతి నరసింహారెడ్డి కుమారుడు, పీఏసీఎస్ సదాశివపేట చైర్మన్ రత్నాకర్ రెడ్డి కుటుంబ సభ్యులు నిర్వహిస్తున్న స్మారక క్రికెట్ టోర్నమెంట్ 'వెల్టూర్ ప్రీమియర్ లీగ్-2025' ఘనంగా ప్రారంభమైంది. బీఆర్ఎస్ యువ నాయకులు చింతసాయినాథ్ ఈ క్రికెట్ టోర్నమెంట్‌ను శనివారం ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో పబ్బతి రత్నాకర్ రెడ్డి, పార్టీ సదాశివపేట మండలాధ్యక్షులు పెద్దగొల్ల ఆంజనేయులు, లక్ష్మారెడ్డి, తొంట యాదమ్మ- కిష్టయ్య, సలావుద్దీన్, చోటు, గడ్డమీది సత్యనారాయణ, రాజు, పాండు, శ్రీను, యాదయ్య, సురేశ్, వేణు, శ్రీకాంత్ పాటిల్, శ్రీకాంత్ గౌడ్, శేఖర్‌గౌడ్ తదితరులు, టోర్నమెంట్ ఆర్గనైజర్స్ పాల్గొన్నారు.



ఎస్సీ సంఘీభావ సభకు భేల్ ఉద్యోగులు

నవతెలంగాణ-రామచంద్రాపురం

హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో శనివారం జరిగిన ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ అమలుకై మేధావుల సంఘీభావ సభకు బీహెచ్‌ఈఎల్ పరిశ్రమ నుంచి మాదిగ ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మందకృష్ణ మాదిగతో పాటు ప్రొఫెసర్ కాసిం అధ్యక్షతన జరిగిన ఈ సభకు పరగోపాల్, జయప్రకాష్ నారాయణ, నందిని సిద్ధారెడ్డి, కోదండరాం, నాగేశ్వరరావు మరియు పలువురు మేధావులు సభకు హాజరై సంఘీభావం తెలిపారు.

బాదం ఆకు పై, పుచ్చకాయ పై వివేకానంద చిత్రం





నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

భారతదేశ ఔన్నత్యాన్ని ప్రపంచమంతా చాటిన స్వామి వివేకానంద జయంతి సందర్భంగా.. బాదం ఆకుపై, పుచ్చకాయ పైన స్వామి వివేకానంద చిత్రాన్ని గీసి గుండు శివకుమార్ అందర్నీ ఆశ్చర్యపరిచాడు. తన కళ రూపంలో వివేకానందాకు జయంతి శుభాకాంక్షలు తెలిపారు.



పల్లె దవాఖానాలో బండలు వేయించిన షేక్ సద్దాం

నవతెలంగాణ-కొండాపూర్

షేక్ సద్దాం హుస్సేన్ తన సొంత డబ్బులు రూ.20వేలతో మండల పరిధిలోని గంగారం పల్లె దవాఖానాలో బండలు వేయించారు. దవాఖానాకు వచ్చే రోగులు ఇబ్బంది పడొద్దని.. బండలు వేయించినట్టు ఆయన చెప్పారు. ఈ సందర్భంగా ఆయనకు డాక్టర్ గీతాంజలి, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి



నవతెలంగాణ-కొండాపూర్

తెలంగాణలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. త్వరలో జరగబోయే స్థానికసంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లను పెంచడానికి ప్రత్యేక అసెంబ్లీ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో 42శాతం ఇచ్చిన హామీకి కట్టుబడి ఉండాలన్నారు.



హ్యాండ్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు సెయింట్ ఆన్స్ విద్యార్థులు ఎంపిక

నవతెలంగాణ-సంగారెడ్డి

హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ నిర్వహించిన పోటీకి మెదక్ జిల్లా సెక్రెటరీ విజయబాబు హాజరయ్యారు. సెయింట్ ఆంథోనీస్ పాఠశాలకు చెందిన విద్యార్థులు అరవింద్, నవదీప్ అద్విక్ భరత్, ప్రద్యుమ్న, కార్తీక్‌లు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కే.ఆంథోని రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయికి విద్యార్థులు ఎంపిక కావడం ఎంతో గర్వంగా ఉందన్నారు. మానసిక వికాసానికి క్రీడలు ఎంతో తోడ్పడుతాయన్నారు. మరిన్ని విజయాలు విద్యార్థులు సాధించా లని ఆకాంక్షించారు. వారిని ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులకు, పిఈటి మాస్టర్ విశాల్, సంతోష్ లను అభినందించారు.



అయోధ్య రామయ్య వార్షికోత్సవ ర్యాలీ

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

అయోధ్యలో రామ మందిరంలో బాల రాముడిని ప్రతిష్ఠించి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా మొదటి వార్షికోత్సవ వేడుకలను బొల్లారం మున్సిపాలీలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ ఆలయం నుంచి గాంధీ నగర్ రామ మందిరం వరకు పెద్ద ఎత్తున హిందూ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ వి.చంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సంపత్ రెడ్డి, దిననాథ్, రాజారామ్, శ్రీమన్నారాయణ, నరేందర్, రవితేజ, రోహిత్, మా అంబే మహిళా సేవా సమితి సభ్యులు, ఆటో యూనియన్ నాయకులు, యువకులు, ధర్మ ప్రచార సమితి సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

కలెక్టరేట్లో ఘనంగా ఓబన్న జయంతి వేడుకలు

నవతెలంగాణ-సంగారెడ్డి



జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు ఒడ్డె ఓబన్న జయంతి వేడుకలను కలెక్టరేట్ సమావేశ మందిరం లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ క్రాంతి వల్లూరు ముఖ్యఅతిథిగా హాజరై ఒడ్డె ఓబన్న చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళ్లర్పించారు. ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అందరికీ స్వేచ్ఛ, సమానత్వం, గౌరవం కల్పించాలనే ఆశయంతో పోరాడిన స్వాతంత్ర్య సమరయోధుడు ఒడ్డె ఓబన్న అని అన్నారు. స్వాతంత్ర్య సంగ్రామంలో ఒడ్డె ఓబన్న పాత్ర అత్యంత ప్రభావవంతమైందని గుర్తుచేశారు. నిరంకుశ బ్రిటిష్ పాలనను ఎదిరించి తన ప్రజల హక్కుల కోసం ఆత్మవిశ్వాసంతో పోరాడిన ఓబన్న వంటి నాయకుల జీవితం ప్రతి ఒక్కరికీ ఒక గొప్ప ప్రేరణ అన్నారు. తన సామాజిక వర్గాన్ని గుర్తించి, వారికి గౌరవం తీసుకురావడానికి ఆయన కృషి చేశారన్నారు. ఆయన జీవితం నుంచి అందరూ స్ఫూర్తి పొందాల్సిన అవసరం ఉందన్నారు. బలహీనవర్గాల హక్కుల కోసం ఆయన చేసిన కృషి గురించి యువతకు అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులకు ఒడ్డె ఓబన్న వంటి త్యాగధనుల త్యాగాలను తెలుసుకొని, దేశసేవకు అంకితమవ్వాలన్నారు. బడుగు, బలహీనవర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, విద్య, ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలను కల్పించడంలో కృషి చేస్తుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్,సహాయ బిసి సంక్షేమాధికారి కె.భాగ్యలక్ష్మి, జిల్లా వడ్డెర సంఘం అధ్యక్షులు వరికుప్పల లింగయ్య, సంఘం నాయకులు పల్లపు అంజయ్య, విఎంఎల్ చక్రవర్తి, శ్రీనివాస్, జైరాం, ఆంజనేయులు, వివిధ సంఘాలనాయకులు, సిబ్బందితదితరులు పాల్గొన్నారు.

అమీన్‌పూర్ అభివృద్ధికి కృషి చేస్తా





నవతెలంగాణ-అమీన్‌పూర్

అమీన్‌పూర్ మున్సిపాల్టీ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మున్సిపాల్టీలోని పలు అభివృద్ధి పనుల కు స్థానిక మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డితో కలిసి శనివారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. హైదరాబాద్ మహానగరానికి దగ్గరగా ఉన్న అమీన్‌పూర్ మున్సిపాల్టీ రోజురోజుకు పెరుగుతున్న జనాభాకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నిరంతరం పనిచేస్తామన్నారు. మున్సిపాల్టీ పరిధిలోని వివిధ కాలనీల్లో కోటి రూపాయల అంచనా వ్యయంతో చేపట్టిన వివిధ అభి వృద్ధి పనులకు శంకుస్థాపన ప్రారంభోత్సవాలు చేసినట్టు చెప్పారు. స్థానిక మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి సహాయ సహకారాలతో ప్రతీ కాల నీని ఆదర్శంగా తీర్చిదిద్దామన్నారు. ప్రధానంగా సీసీ రోడ్డు, యూజీడిలు, పార్కులు, తదితర అభివృద్ధి పనులకు ప్రథమ ప్రాధాన్యత ఇచ్చామన్నారు.అంగన్వాడీల పునరుద్ధరణకు కోకోకోలా సంస్థ సహకారం అందించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మెన్ నరసిం హగౌడ్, కౌన్సిలర్లు, కోఆప్షన్స్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వడ్డే ఓబన్న పోరాటం మరువలేనిది

నవతెలంగాణ-పటాన్‌చెరు



ప్రజల స్వేచ్ఛ స్వాతంత్రం కోసం అలుపెరుగని పోరాటం చేసిన వడ్డే ఓబన్న సేవలు మరువలేనివని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. వడ్డే ఓబన్న 218వ జయంతిని పురస్కరించుకొని శనివారం మండలంలోని చిట్కుల్ లోని నీలం మధు క్యాంపు కార్యాలయంలో వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉయ్యాలవాడ నరసింహారెడ్డి బాల్య మిత్రుడిగా ముఖ్య అనుచరుడిగా, సేనాధి పతిగా.. చిన్న, సన్నకారు రైతులను వేధిస్తున్న బ్రిటిష్ ప్రభుత్వంపై తిరుగుబావుట ఎగురవేసిన మహనీ యుడు వడ్డే ఓబన్న అన్నారు.నేటి తరం ఆ మహనియుడిని ఆదర్శంగా తీసుకుని ముందుకు పోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మంజలి దస్తగిరి, బీరాంగూడ కృష్ణ,వలేపు వెంకటేశ్, పిట్ల లక్ష్మణ్, రాజ్ కుమార్,శ్రీను, అభిరామ్, ఈశ్వర్, గోపాల్, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'సర్వధర్మ సమ్మేళనం సభ' జయప్రదం చేయాలి

నవతెలంగాణ నారాయణఖేడ్ రూరల్

జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్ తండ్రి స్వతంత్ర సమరయోధులు, మాజీ ఎమ్మెల్యే శివరావు షెటాకర్ 29వ వర్ధంతి సభ 'సర్వధర్మ సమ్మేళనం' ఈనెల 13న జరుగుతున్నదని రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రాకేష్ షెట్కార్ తెలిపారు. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శివరావు షెట్కార్ మృతి చెంది.. 29 ఏండ్లు గడిచాయని గుర్తు చేశారు. దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో ఆయన నిర్వహించిన వీరోచిత పాత్ర, సమాజానికి వారు చేసిన సేవఅమోఘమైనదన్నారు. శివరావు షెట్కార్ ఆశయ, ఆదర్శాలను నేటి తరానికి అందించాలనే సదుద్దేశంతో వారి వర్ధంతి సభను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కాబట్టి జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలు, అభిమానులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై సభను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.



ఘనంగా వడ్డే ఓబన్న జయంతి వేడుకలు

నవతెలంగాణ-రామచంద్రాపురం



రామచంద్రాపురం పట్టణంలోని శ్రీనివాస్‌నగర్ కాలనీలో స్వాతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న 218 జయంతిని శనివారం ఘనంగా జరిపారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఉమ్మడి మెదక్ జిల్లా వడ్డెర సంక్షేమ సంఘం అధ్యక్షులు డాక్టర్ వరికుప్పల లింగయ్య ఆధ్వర్యంలో వడ్డెర బస్తీలో ఓబన్న విగ్రహావిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ జెరిపేటి జైపాల్ హాజరై విగ్రహ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో వడ్డెర జాతికి గర్వకారణమైన వడ్డే ఓబన్న జయంతిని అధికారికంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నా మన్నారు. దాదాపు 6000 మందితో రవీంద్ర భారతిలో భారీ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్య అతిథులుగా ప్రభుత్వ పెద్దలు అందరూ హాజరవుతున్నారన్నారు. రామచంద్రాపురంలో వడ్డెర కుల సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు వరికుప్పల లింగయ్య ఆధ్వర్యంలో భారీ విగ్రహావిష్కరణ చేయడం చాలా ఆనందంగా ఉందని, ఈ సందర్భంగా ఆయనకు ప్రత్యేకంగా అభినందించారు. ప్రతి సంవత్సరం కూడా ఇదే విధంగా రాష్ట్రవ్యాప్తంగా వడ్డే ఓబన్న జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్ర మంలో నాయకులు శ్రీరాములు, సాయికుమార్, బొంత నరసింహ, అంజయ్య ముత్యాలు, ఎట్టయ్య, సిద్దయ్య, పెద్దులు, వడ్డెర కుల సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

'బ్లెస్సింగ్ ఫుల్ లైఫ్'లో పాల్గొన్న పులిమామిడి రాజు



నవతెలంగాణ-సదాశివపేట

కర్నాటక రాష్ట్రంలోని బీదర్ జిల్లా, రాంపూర్ కాలనీలో బ్రహ్మకుమారిస్ (ఓంశాంతి) సెంటర్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బ్లెస్సింగ్ ఫుల్ లైఫ్ ఆధ్యాత్మిక కార్యక్రమంలో భాగంగా.. ఇంటర్ నేషనల్ మోటివేషన్ స్పీకర్ అండ్ గైడ్ అండ్ మెంటేనర్ శివాణి అక్కయ్య బీదర్ సెంటర్ వారి ఆధ్వర్యంలో బ్రహ్మ కుమారీస్ వారు శనివారం నిర్వహించిన మోటివేషన్ లైఫ్ ప్రత్యేక కార్యక్రమానికి రాష్ట్ర కాంగ్రెస్ నాయ కులు పులిమామిడి రాజు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి పులిమామిడి రాజు మాట్లాడుతూ.. నేటి కాలంలో మానసిక ప్రశాంతత కోసం ఓంశాంతి లాంటి సెంటర్లు ఎంతగానో ప్రజలకు ఉపయోగపడుతున్నాయన్నారు. ప్రశాంతతను కలిగిస్తున్న సెంటర్లను కొనసా గిస్తున్న బ్రహ్మకుమారిస్ అక్కయ్యలకు, అన్నయ్యలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఇంత చక్కటి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి, తనను ఈ మహోత్తరమైన కార్యక్రమానికి ఆహ్వానించినందుకు బీదర్ బ్రహ్మకుమారి సెంటర్ వారికి కృతజ్ఞతలు చెప్పారు.ఈ కార్యక్రమంలో సంగారెడ్డి,సదాశివపేట బ్రహ్మకుమారిస్ వారు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఘనంగా సంక్రాంతి సంబురాలు









నవతెలంగాణ-రామచంద్రాపురం

రామచంద్రాపురంలోని మయూరినగర్‌లో గల స్కాలర్స్ హై స్కూల్లో శనివారం సంక్రాంతి వేడుకలు జరిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్ప నాగేష్ హాజరై సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. సంక్రాంతి పండుగ ఉట్టిపడేలా సాంస్కృతి కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. విద్యార్థులకు విద్యతో పాటు తెలుగు సంప్రదాయాలను తెలియపరిచేందుకు స్కాలర్స్ పాఠశాల మంచి కార్యక్రమాలను నిర్వహించడం పట్ల కార్పొరేటర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ జనా ర్ధన్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు కార్పొరేటర్ బహుమతుల ప్రదానం చేశారు.

సంగారెడ్డి : సంగారెడ్డి పట్టణ కేంద్రంలోని శ్లోకాస్ శ్రీవాణి హై స్కూల్లో పాఠశాలలో మకర సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ హసన్ మాట్లాడుతూ.. చదువుతోపాటువిద్యార్థుల్లో సంస్కృతీ సాంప్రదాయాలు పండుగ పత్యేకతలు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా వచ్చే నెలలో బైపాస్‌రోడ్‌లో దీ శ్లోకాస్ హైస్కూల్‌ను అన్ని సదుపాయాలతో ఐసిఐసి సిలబస్‌తో నూతనంగా ప్రారంభించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో నూర్జహాన్, కల్పనారెడ్డి, గీతారెడ్డి, సుస్మిత, యాదగిరి, మాధవ కృష్ణ, సుజాత, పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయ బృందంతోపాటు విద్యార్థినిలు పాల్గొన్నారు.

సంగారెడ్డి పట్టణంలోని సెయింట్ పీటర్స్ పాఠశాలలో సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.విద్యార్థుల సాంప్రదాయ నృత్యాలతో వేడుకలు ప్రారంభించారు. ముచ్చటైన ముగ్గులతో, చిరునవ్వుల చిందించే వదనంతో చిన్నారులు పతంగులను చేసి పాఠశాల ఆవరణలో అలంకరించారు. ప్రతి తరగతి ముందు చక్కని రంగవల్లులతో చూడముచ్చటైన ముగ్గులు వేసి పండుగ పట్ల వారి ఆసక్తిని తెలిపారు. ప్రతి సంవత్సరం విద్యార్థులకు భిన్నత్వంలో ఏకత్వం చాటే మన భారతీయ సంస్కృతి సంప్రదాయాలు విద్యార్థులకు తెలియజేయాలనే ముఖ్య ఉద్దేశంతో పాఠశాలలో నిర్వహించడం జరిగిందని, చెర్మెన్ ఈదర ఆంథోనీ రెడ్డి, ప్రధాన ఉపాధ్యాయులు రవికుమార్ రెడ్డిలు అన్నారు.

సదాశివపేట : సదాశివపేట పట్టణంలోని భవిత జూనియర్ కళాశాలలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వేసిన ముగ్గులు అందరినీ ఆకర్షించాయి. చుక్కలతో వేసిన రంగవల్లులు మధ్య గొబ్బెమ్మలు, చెరుకు గడులు, భోగి మంటలు, సంక్రాంతి శోభను ముందే తెచ్చాయి. విద్యార్థులు వేసిన ముగ్గులకు ప్రతి ఒక్కరికి ప్రోత్సాహక బహుమతులు అందేవిధంగా ప్రథమ బహుమతిగా శివాని, ద్వితీయ బహుమతిగా వైష్ణవి, తృతీయ బహుమతిగా హర్షిత వాగ్దేవి ఎంపికయ్యారు. అలాగే విద్యార్థులు గాలి పటాలను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కరస్పాండెంట్ బాలరాజు, డైరెక్టర్ మధుకర్ రెడ్డి, రాజు, అధ్యాపకులు మల్లేశం, నిలోపత్ రెడ్డి, సుజాత, సంతోషి, మంజుల, లలిత, కే విజయలక్ష్మి, ఎస్ విజయలక్ష్మి,పావని, నికిత, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

నారాయణఖేడ్‌రూరల్ : నారాయణఖేడ్ పట్టణం పల్లవి



మోడల్ స్కూల్, విజేత స్కూల్ లో సంక్రాంతి సంబరాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు.. విద్యార్థిని విద్యార్థులతో పాటు విద్యార్థి విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొనడం పాల్గొన్నారు.. విజేత స్కూల్లో ముగ్గుల పోటీలు పెట్టడం జరిగిందని, ముగ్గుల పోటీలో గెలుపు పొందిన వారికి బహుమతుల ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో పల్లవి మోడల్ స్కూల్ డైరెక్టర్ డి ఓం ప్రకాష్, ప్రిన్సిపాల్ ప్రవళిక, విజేత స్కూల్ ప్రిన్సిపల్ శ్రీనివాసరెడ్డి తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు..

మండలంలో రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు

ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి.



నవతెలంగాణ-శివ్వంపేట

మండలంలోని పలు గిరిజన తండాలకు బీటీ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి తెలిపారు. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అల్లీపూర్ బీటీ నుంచి అల్లీపూర్ తండా వరకు బీటీ నిర్మాణం కోసం రూ.70 లక్షలు, ఉసిరికపల్లి, వెల్దుర్తి జెడ్పీ రోడ్డు నుంచి తౌర్య తండా వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ. 1.54 కోట్లు, చెంది, గంగాయిపల్లి రోడ్డు నుంచి జగ్యతండా వరకు రూ.49 లక్షలు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన గిరిజన తాండలకు బీటీ రోడ్ల నిర్మాణానికి టెండర్లు పిలవడం కూడ పూర్తయిందని, అతి త్వరలోనే పనులు కూడ ప్రారంభించడం జరుగుతుందని ఆమె తెలిపారు. గిరిజన తాండలకు బీటీ రోడ్డు నిర్మాణానికి నిధుల మంజూరు కోసం కృషి చేసిన ఎమ్మెల్యే సునీతారెడ్డికి గిరిజన తాండవాసులు, నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

ఎన్జీవోస్ కాలనీ చౌరస్తా వద్ద స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయాలి

కాలనీ వాసులు ఆనంద్ కుమార్



నవతెలంగాణ-నర్సాపూర్ : నర్సాపూర్ పట్టణంలోన ఎన్జీవోస్ కాలనీ చౌరస్తా వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని పట్టణ నాయకులు పి.ఆనంద్ కుమార్ కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ హైదరాబాద్-మెదక్ జాతీయ రహదారిపై వాహనాలు వేగంగా వస్తున్నాయని, ఎన్జీవోస్ కాలనీ ప్రజలు రోడ్డు దాటేందుకు భయపడుతున్నారన్నారు, కాలనీలో స్కూల్, ఐటిఐ, ఆసుపత్రి ఉన్నాయని ప్రజలు, విద్యార్థులు భారీ ఎత్తున రాకపోకలు నిర్వహిస్తారని తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ఇక్కడ స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తే వాహనాల వేగం తగ్గుతుందన్నారు. నేషనల్ హైవే అథారిటీ అధికారులు వెంటనే స్పందించ ఎన్జీవోస్ కాలనీ చౌరస్తా వద్ద ప్రధాన రోడ్డుపై స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అల్లీపూర్‌లో అంత్యక్రియలలో పాల్గొన్న ఎమ్మెల్యే



నవతెలంగాణ-శివ్వంపేట

పనులు ముగించుకొని ఇంటికి తిరిగి వస్తుండగా మృత్యువు లారీ రూపంలో దూసుకొచ్చి శుక్రవారం అల్లీపూర్ గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు పిట్ల నాగరాజు, కమ్మరి దుర్గాప్రసాద్ మృత్యువాత పడిన విషయం తెలుసుకున్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి శనివారం అల్లీపూర్ గ్రామంలో జరిగిన యువకుల అంత్యక్రియలలో పాల్గొన్నారు. అంతకు ముందు తమ కుమారులను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న బాధిత కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మరణించడం బాధాకరమని, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం రూ.25 లక్షల ఎక్స్ గ్రేసియా చెల్లించి, అన్నివిధాలా అండగా నిలవాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రభుత్వం నుంచి సహకారం అందేలా తప్పకుండ కృషి చేస్తానని ఆమె ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ మాజీ కో ఆప్షన్ మెంబర్ మన్సూర్, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు రమణ గౌడ్, మాజీ సర్పంచ్ సుగుణ శ్రీనివాస్, చింతకాయల యాదగిరి,సాదు రాములు, పిట్ల గోపాల్, శివరాములు, తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు మాజీ జెడ్పీటీసీ ఆర్థికసాయం

రూ.50 వేల ఆర్థిక సహకారం అందించిన మహేష్ గుప్త.



నవతెలంగాణ-శివ్వంపేట

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అల్లీపూర్ గ్రామానికి చెందిన పిట్ల నాగరాజు, కమ్మరి దుర్గాప్రసాద్ మృతదేహాలను నర్సాపూర్ ఆసుపత్రిలో మాజీ జడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్త శనివారం సందర్శించి, బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. అంత్యక్రియల కోసం రూ.20 వేల ఆర్థిక సహాయం అందజేశారు. లింగోజీగూడ తాండకు చెందిన మాలోత్ అమ్మయ నాయక్ ఇటీవలే గుండెపోటుతో మరణించగా, ఇదే తాండకు చెందిన మాలోత్ చందర్ రోడ్డు ప్రమాదంలో మరణించిన విషయం తెలుసుకొని బాధిత కుటుంబాల వద్దకు వెళ్లి రూ.20 వేల ఆర్థిక సహకారం అందజేశారు. మండలంలోని చిన్నగొట్టిముక్కుల గ్రామానికి చెందిన పాంబండ ఆగమయ్య ఇటీవలే మరణించగా, గుద్దేటి నర్సిములు రోడ్డు ప్రమాదంలో గాయపడగా బాధిత కుటుంబాలకు రూ.10 వేల ఆర్థికసాయంతో పాటు నిత్యావసర సరుకులను కూడ అందజేశారు. ఈ సందర్భంగా మహేష్ గుప్త మాట్లాడుతూ ప్రతి బాధిత కుటుంబాన్ని ఆపదలో ఆదుకోవడమే తన లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు మెగావత్ రవి, బాలమణి నరేందర్, మాజీ ఎంపీటీసీ నర్సింగరావు, మాజీ ఉపసర్పంచ్ చింత స్వామి, డాక్టర్ సంద్ర సుదర్శన్, యాదగిరి రావు, లింగోజీగూడ భూపాల్, మొలుగు నర్సిములు, మాలోత్ గోపాల్, మెగావత్ బాబు, నేనావత్ రాజు,గ్రామకమిటీ ఉపాధ్యక్షులు పిల్లి శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన సుహాసిని రెడ్డి



నవతెలంగాణ- కౌడిపల్లి

గత కొన్ని రోజుల క్రితం మృతి చెందిన వార్డు సభ్యురాలు కుటుంబాన్ని జిల్లా గ్రంధాలయ చైర్మన్ సుహాసిని రెడ్డి, నర్సాపూర్ ఎంఎల్ఏ సునీత రెడ్డిలు పరామర్శించారు. శనివారం మండల కేంద్రంలోని బుధవారం ఓబలాసి లక్ష్మి అనారోగ్యంతో మృతి చెందడంతో శనివారం జిల్లా గ్రంధాలయ చైర్మన్ చిలుముల సుహాసిని రెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, దుర్గారెడ్డి, తదితరులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

మల్లిక్‌ను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



నవతెలంగాణ-మెదక్

పట్టణంలోని నవీపేట్ వీధికి చెందిన మునిసిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్ చిన్నమ్మ ఆరేళ్ల లక్ష్మీనర్సమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయమై శనివారం మధ్యాహ్నం బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ శాసనసభ్యులు, పద్మ దేవేందర్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. ఆమె వెంట మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ ఆకిరెడ్డి కృష్ణారెడ్డి, పట్టణ పార్టీ కన్వీనర్ మామిళ్ల ఆంజనేయులు, కార్యదర్శి గడ్డమిది కృష్ణగౌడ్, కౌన్సిలర్లు భీమరి కిషోర్, ఆర్కె శ్రీనివాస్, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, లింగ రెడ్డి, శ్యాంసుందర్, సలాం భాయ్ సాప. సాయిలు తదితరులు ఉన్నారు.

బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు ఎంతో ఆసరా



నవతెలంగాణ-శివ్వంపేట

సీఎం రిలీఫ్ పండ్ చెక్కులు బాధిత కుటుంబాలకు ఆర్థికంగా ఎంతో ఆసరాగా నిలుస్తాయని ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ జడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్త అన్నారు. మండల కేంద్రమైన శివ్వంపేటకు చెందిన గంగాల శైలజకు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.48 వేల చెక్కును మాజీ జడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్త శనివారం బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. మండలంలోని కొంతాన్‌పల్లికి చెందిన టేకులపల్లి అంజమ్మకు మంజూరైన రూ. 51 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా మహేష్ గుప్త మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించుకొని ఆర్థికంగా ఇబ్బందులు పడే బాధిత కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు ఆర్థికంగా కొంత ఊరటనిస్తాయన్నారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఆకుల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ గైనిబైటి శ్రీనివాస్ గౌడ్, టేకులపల్లి వేమారెడ్డి, వంజరి కొండల్, బాసంపల్లి పోచగౌడ్, ఒగ్గె శ్రీనివాస్,దొడ్ల అశోక్, దేవేందర్ గౌడ్, త్రినేష్ గౌడ్,ఖదీర్, వజ్జ హరీష్, తదితరులు పాల్గొన్నారు.

గుంతలమయంగా మారిన నస్కల్ రోడ్డు

- పట్టించుకోని కాంట్రాక్టర్
- చర్యలు తీసుకోని ప్రభుత్వం
- నస్కల్ గేటు వద్ద గ్రామస్తులు రిలే నిరాహార దీక్ష





నవతెలంగాణ-నిజాంపేట

గ్రామీణ ప్రాంతాలకు అత్యధిక నిధులు కేటాయించి రోడ్లు వేసేలా తగు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ప్రభుత్వం ఒకపక్క చెప్తున్నది. కానీ మెదక్ జిల్లా నిజాంపేట మండల కేంద్రం నుంచి నస్కల్, రాంపూర్, నగరం, నందగోకుల్, గ్రామాలకు వెళ్లాలంటే అనేక ఇబ్బందులకు గురవుతున్నామని నస్కల్ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శనివారం మండల కేంద్రంలోని నస్కల్ గేటు వద్ద టెంటు వేసుకొని గ్రామానికి చెందిన గ్రామస్తులు రిలే నిరాహార దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలప్పుడు నాయకులు రాంపూర్ గ్రామం ఈశాన్య దిశకు ఉన్నదని ఇక్కడి నుండే ప్రచారం మొదలుపెడతారు. కానీ ఇక్కడ అభివృద్ధి మాత్రం పట్టించుకోవడంలేదని, పది సంవత్సరాల నుంచి రోడ్డు పూర్తిగా గుంతల మయం అయిందని ద్విచక్ర వాహనాలు కూడా నడవలేని పరిస్థితి ఉందన్నారు. గత సంవత్సరం నుంచి కాంట్రాక్టర్ కంకర పోసి విడిచి పెట్టారని బీటి రోడ్డు వేయలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నాలుగు గ్రామాలకు అంబులెన్స్‌లు, ఆటోలు రావాలన్నా రాలేకపోతున్నారు. స్కూల్ పిల్లలు బడికి వెళ్లాలంటే బస్సులు రాలేకపోతున్నాయి తమ గ్రామాలు మాత్రం పూర్తిగా వెనుకబడి ఉన్నాయని, ప్రభుత్వాలు మాత్రం పట్టించుకోవడంలేదని ఆరోపించారు. అసలు తాము తెలంగాణ రాష్ట్రంలో ఉన్నామా లేదా అనే సందిగ్ధంలో ఉన్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాలు మారడంతో ప్రజల కష్టాలు తీరుతాయనుకుంటే కష్టాలు ఎక్కువైనాయని గ్రామస్తులు పేర్కొన్నారు. ఎన్నాళ్ళని కంకర రోడ్డుపై ప్రయాణం చేయాలని అనేక ప్రమాదాలకు గురవుతున్నామన్నారు. ఏదిఏమైనాప్పటికీ నస్కలు రోడ్డు పనులు మొదలు పెట్టేవరకు రిలేనిరాహార దీక్షలు విరమించేది లేదని భీష్మించుకుని కూర్చున్నారు. ప్రభుత్వ అధికారులు స్పందించి వెంటనే నస్కల్ రోడ్డు పనులు మొదలు పెట్టేలా తగు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. కార్యక్రమంలో దేశెట్టి లింగం, దుబాసిసంజీవ్, మెడికల్ ఎల్లం యాదవ్, నరేష్ గౌడ్, అజయ్, రహీం, దుర్గయ్య, మెట్టు లింగం, హబీబ్, కోనేరు రాజు, మెట్టు రవి, పాల్గొన్నారు.

బిల్లులు చెల్లిస్తే పనులు చేస్తా

కాంట్రాక్టర్‌ను వివరణ కోరగా చేసిన పనులకు బిల్లులు రావడం లేదని, ఆ బిల్లులు చెల్లించినట్లయితే పని మొదలు పెడతానని అంతవరకు పని చేసేది లేదని తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బదనాం చేస్తున్నారు

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల రోడ్డు కాలేకపోయింది
రోడ్డు పనులపై అధికారులతో ఎమ్మెల్యే చర్చలు
- కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-నిజాంపేట



కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల నస్కల్ రోడ్డు పనులు జరగడంలేదని మండల కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు. నారా _పూర్ తాజా మాజీ సర్పంచ్ అమరాసేనారెడ్డి శనివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల రోడ్డు పనులు నిలిపివేశారని ప్రభుత్వాన్ని బదనాం చేయాలనే ఉద్దేశంతో కాంట్రాక్టర్ వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వంపై బురద వల్లే ప్రయత్నం చేస్తున్నారని మాజీ సీఎంమ కేసీఆర్ దగ్గరి బంధువైన కాంట్రాక్టర్ వల్లనే పనులు ఆగిపోయాయని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు పనులు మొదలు పెట్టాలని బిల్లు ఇప్పిస్తానని చెప్పినప్పటికీ పనులు మొదలు పెట్టడం లేదని తెలిపారు. వాస్తవంగా నాలుగు గ్రామాల ప్రజలు రోడ్డు వలన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రోడ్డు పనులను కచ్చితంగా చేసే విధంగా అధికారులతో ఎమ్మెల్యే చర్చిస్తున్నారని త్వరలోనే పనులు మొదలు పెట్టేలా తగు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎస్ఓ మండల ఇన్చార్జి వెల్దుర్తి వెంకటేష్ గౌడ్, నసీరుద్దీన్, వై.వెంకటేశం, బక్కన్నగారి లింగం గౌడ్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

అట్టడుగు వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్





నవతెలంగాణ-మెదక్

ఇందిరమ్మ ఇండ్ల పథకం, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల జారీ, రైతు భరోసా పథకాలను జిల్లాలో పకడ్బందీగా అమలు చేస్తామని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజు తెలిపారు. జిల్లాలో పకడ్బందీగా అమలు చేసేందుకు జాబితా ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. శనివారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల జారీ, రైతు భరోసా జిల్లాలో అమలు చేసే విధివిధానాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల పథకం సర్వే జిల్లాలో 96% పూర్తి చేశామని, అర్హత గల నిజమైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల పథకం పగడ్బందీగా అమలు అమలు చేసే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. రైతుల సంక్షేమం, నిరుపేద కుటుంబాల అభివృద్ధి కోసం రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్ల వెరిఫికేషన్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. రైతు భరోసా పథకంలో అర్హులైన రైతుల వివరాలను క్షేత్రస్థాయిలో సమీక్షించి, లబ్ధిదారుల పేర్లను జాబితాలో చేర్చాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అర్హులైన నిరుపేదలకు ఇళ్లు కేటాయించే ప్రక్రియను కూడా వేగవంతం చేయాలన్నారు. వెరిఫికేషన్ 16వ తేదీ నుంచి ప్రారంభించి 20వ తేదీ నాటికి పూర్తిచేయాలన్నారు. 16వ నుంచి 18వ తేదీ వరకు ఫీల్డ్ పనులు పూర్తి చేసి, 19వ తేదీ నాటికి కార్యాలయంలో సమీక్ష జరిపి, తుది జాబితాను 20వ తేదీకి సమర్పించాలన్నారు. 21వ నుంచి 24వ తేదీ వరకు గ్రామ సభలు నిర్వహించి, తుది జాబితా ఆధారంగా లబ్ధిదారులను ఖరారు చేయాలన్నారు. ప్రతి మండలాన్ని రెండు భాగాలుగా విభజించి, ప్రతి భాగానికి డిప్యూటీ తహసీల్దార్‌ను బాధ్యత వహించేలా నియమించాలని సూచించారు. డిప్యూటీ తహసీల్దార్‌తో పాటు సీనియర్ అసిస్టెంట్ లేదా ఒక కంప్యూటర్ ఆపరేటర్‌ను సైతం ఉంచుకుని డేటాను సక్రమంగా సమీక్షించి, సరైన పద్ధతిలో సర్వేను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు జయచంద్ర రెడ్డి, రమాదేవి, మైపాల్ రెడ్డి, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిఆర్డిఓ శ్రీనివాస్, డిపిఓ యాదయ్య, డిఎస్ఓ సురేష్, అగ్రికల్చర్ అధికారి వినయ్, హౌసింగ్ పిడి మాణిక్యం హౌసింగ్ డిఈలు, ఈఈలు , ఎంపీడీవోలు, వ్యవసాయ శాఖ ఏడీలు, ఏవోలు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులు పండుగ పూట పస్తులుండాలా?

మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేసి,వేతనాలు పెంచాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఏ.మహేందర్ రెడ్డి



నవతెలంగాణ-తూప్రాన్

గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించి,మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఏ.మహేందర్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.తూప్రాన్‌లో విలేకరులతో మాట్లాడుతూ గ్రామాలలో పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరా, వీధి లైట్లు,డంపింగ్ యార్డ్స్, హరితహారం,పల్లె పకృతి వనాలు,వైకుంఠధామాలు తదితర పనుల్లో నిత్యం శ్రమిస్తూ గ్రామీణ ప్రాంతాలలో ఎలాంటి అంటువ్యాధులు, అనారోగ్యాలు రాకుండా ప్రజలకు సేవలందిస్తున్నారన్నారు. ఎన్నో సంవత్సరాల తరబడి విధులు నిర్వహిస్తున్నానేటికీ పనికి భద్రత, శ్రమకు తగిన వేతనం చెల్లించకుండా ప్రభుత్వాలు గుర్తించలేదన్నారు. వారికి ఇస్తున్నదే అతితక్కువ వేతనాలు,అవి కూడా నెలల తరబడి చెల్లించక పోవడంతో కార్మికులు అప్పుల పాలై అనేక ఇబ్బందులకు గురౌతున్నారని విమర్శించారు. సంక్రాంతి పండుగ పూట కూడా పంచాయతీ కార్మికులు పస్తులుండాల్సిన ప్రస్తుత ప్రభుత్వంలో కార్మికులకు పరిస్థితి ఏర్పడిందన్నారు. తక్షణమే బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం పంచాయతీ కార్మికుల మెడకు ఉరితాళ్ళను బిగించి,మల్టీపర్పస్ వర్కర్ పేరుతో కేటగిరీలన్నింటిని రద్దు చేసిందన్నారు. ఆ నాటి నుండి నేటి వరకు మల్టీపర్పస్ వర్కర్ పంచాయతీ కార్మికులు అన్ని రకాల పనులు చేయడం వల్ల ఆ పనులలో నైపుణ్యం లేక పనిచేసే క్రమంలో ప్రమాదాలు జరిగి అనేక మంది కార్మికులు మరణించారన్నారు. మరణించిన కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించక పోవడంతో కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయని వాపోయారు. మల్టీపర్పస్ వర్కర్ పేరుతో కేటగిరీలన్నింటిని రద్దు చేయడంతో చదువు, అర్హత, సీనియార్టీ ఉన్న కలం పట్టిన కారోబార్, బిల్ కలెక్టర్ల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిందన్నారు. విలేజ్ వాటర్ అసిస్టెంట్లుగా నియమిస్తున్న వారందరికి ఉద్యోగ భద్రత కల్పించాలని, ఇతర ప్రభుత్వ శాఖాలలో చెల్లిస్తున్న వేతనాలను అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) అధ్యక్షులు ఎం.నర్సింలు, ఉపాధ్యక్షులు జీవన్, తదితరులు పాల్గొన్నారు.

నాసిరకం పనులతో బస్టాండ్ కాంపౌండ్ వాల్

పట్టించుకోని ఆర్టీసీ అధికారులు

పట్టించుకోవాలని పలువురు వేడుకోలు







నవతెలంగాణ-నిజాంపేట

మండల కేంద్రంలో బస్టాండ్ లేక ఎన్నో సంవత్సరాల నుంచి ప్రయాణికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. మండల కేంద్రంలో బస్టాండు నిర్మించాలనే ఉద్దేశంతో ఆర్టీసీ అధికారులు పాత బస్టాప్ వద్ద బస్టాండ్ స్థలంలో కాంపౌండ్ వాల్ పెట్టించారు. దాదాపు రూ.15 లక్షలను కాంపౌండ్ వాల్ కోసం ప్రభుత్వం మంజూరు చేసింది. కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటించకుండా నాసిరకం పనులు చేస్తున్నారని గ్రామస్తులు పలువురు ఆరోపిస్తున్నారు. ఇసుక, సిమెంటు సమపాళ్లలో కలిపి కట్టాలని నిబంధనలు ఉన్నప్పటికీ కాంట్రాక్టర్ అవేమీ పట్టించుకోకుండా ఇష్టం వచ్చిన రీతిలో కాంపౌండ్ వాల్ కట్టారని కాంపౌండ్ వాల్‌కు క్యూరింగ్ కూడా చేయడం లేదని పలువురు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే కాంట్రాక్టర్‌పై తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

5275 ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులకు సర్వే

ఎంపీడీవో కె.శేషాద్రి



నవతెలంగాణ-తూప్రాన్

మండలంలోని 14 గ్రామ పంచాయతీలలో 5,275 ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల సర్వే పూర్తి చేసినట్లు ఎంపీడీవో కె.శేషాద్రి శనివారం తెలిపారు. మండల వ్యాప్తంగా దాతర్ పల్లి 153, ఘనపూర్ 908, గుండ్రెడ్డిపల్లి 424, ఇమాంపూర్ 313, ఇస్లాంపూర్ 439, కిష్టాపూర్ 280,కోనాయిపల్లి (పి.బి) 215, మల్కాపూర్ 439, నాగులపల్లి 421, నర్సంపల్లి 353, వట్టూరు 126, వెంకటాయపల్లి 478, వెంకటరత్నాపూర్ 196, యావాపూర్ 532 మొత్తం మండలంలో 5275 ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తులు స్వీకరించామని పేర్కొన్నారు. దీంతో 5275 దరఖాస్తులకు గాను 5145 దరఖాస్తులకు సర్వే పూర్తి చేసి, అందులో 5132 ఇందిరమ్మ ఇండ్ల సర్వే వివరాలను ఉన్నతాధికారులకు పంపించామ ని తెలిపారు. మండలంలో ప్రజా పాలనలో భాగంగా 22 మంది దరఖాస్తుదారులు చేసుకొని, ఆ తర్వాత కాలక్రమంలో వారు మృతి చెందినట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా ఇతర కారణాలతో 15 ఇందిరమ్మ ఇండ్లకు సర్వే చేపట్టాలన్నారు.ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక ఉన్నతాధికారులు, మండల అధికారులు, ఇందిరమ్మ ఇండ్ల కమిటీల ఆధ్వర్యంలో ఎంపిక చేస్తారని ఎంపీడీవో కె.శేషాద్రి పేర్కొన్నారు.


అక్షర స్కూల్లో సంక్రాంతి సంబరాలు



నవ తెలంగాణ నర్సాపూర్

నర్సాపూర్ పట్టణంలోని అక్షర స్కూల్లో శనివారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలను తలపించేలా సాంప్రదాయ వస్త్రాలు ధరించి భోగి మంటలు కాల్చి హరిదాస్ వేషం ధరించి అందరిని అలరింపజేశారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్ హాజరై విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ అశోక్ కుమార్, సందీప్, ప్రిన్సిపాల్ రాసి, ఉపాధ్యాయులు సుమిత్ర, స్రవంతి, శాలిని, మౌనిక, శ్రీలత, సరిత, సింధుజ, శాలిని రెడ్డి, శ్రీలత, మహాదేవి తదితరులు ఉన్నారు.

ఘనంగా ప్రారంభమైన మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు



నవతెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో శ్రీ కీతకి భ్రమరాంబిక మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా మొదటి రోజు గంగ జ్యోతి వెలిగించడానికి ఒగ్గు కళాకారులతో కలిసి గంగకు బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణం దాత వాగ్దాస్ రాధా మల్లేష్ గౌడ్, అరవింద్, ముకుందం రెడ్డి, శ్రీను, శ్రీనివాస్ గౌడ్, బాషయ్య తదితరులు ఉన్నారు.

బాధితులకు ఫోన్లను అందించిన డిఎస్పి



నవతెలంగాణ-తూప్రాన్

మండల పరిధిలో పోగొట్టుకున్న 10 సెల్‌ఫోన్‌లను బాధితులకు తూప్రాన్ డిఎస్పి వెంకటరెడ్డి శనివారం పోలీస్ స్టేషన్ లో అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో గతంలో తమ సెల్ ఫోన్లు పోయాయని, దొంగిలించారని, వివిధ రకాల కారణాలతో పోగొట్టుకున్న పదిమంది బాధితులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారన్నారు. బాధితుల ఫిర్యాదుతో సిఈఐఆర్ అనే నూతన సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ట్రేస్ చేసి 10 సెల్ ఫోన్‌లను పట్టుకున్నామని తెలిపారు. 10 మంది సెల్ ఫోన్ లను అందించడంలో కీలక పాత్ర వహించిన ఎస్ఐ జి.శివానందంతో పాటు పోలీసులను డిఎస్పి వెంకటరెడ్డి అభినందించారు.ఈ కార్యక్రమంలో సిఐ రంగకృష్ణ,ఎస్సై జి.శివానందం, పోలీసులు,తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులతో రోడ్డు భద్రత వారోత్సవాలు



నవతెలంగాణ-తూప్రాన్

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రోడ్డు భద్రత మాసోత్సవాలు 2025లలో భాగంగా తూప్రాన్ టోల్ ప్లాజా అల్లాపూర్ వద్ద ప్రయాణికులతో రోడ్డు భద్రత వారోత్సవాల కార్యక్రమాన్ని ఏఎస్ఐ లక్ష్మీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. రోడ్డు భద్రతా వారోత్సవాలలో ముఖ్యమైన రహదారి భద్రతా పద్ధతుల గురించి చెబుతూ ఎఎస్సై లక్ష్మీ,పోలీసులు వాహనదారులకు రోడ్డు భద్రత ప్రమాణాలను ప్రదర్శించిన ఆకర్షణీయమైన రంగస్థల నాటకం, నాటకం ప్రయాణంలో ముఖ్యంగా పాఠశాల బస్సులు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు జాగ్రత్తగా ఉండటం ప్రాముఖ్యతను వివరించారు. తెలంగాణ రోడ్డు రవాణా అథారిటీ మార్గదర్శకాలతో విద్యార్థులకు, వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకే కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రోడ్డు భద్రతను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని,స్నేహితులు, కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలని ఏఎస్ఐ లక్ష్మి కోరారు.

ప్రజల తరపున బరాబర్ ప్రశ్నిస్తాం

నవతెలంగాణ-టేక్మాల్

ఇచ్చిన హామీలు నెరవేర్చకుంటే బరాబర్ ప్రజల పక్షాన ఉండి ప్రశ్నిస్తామని అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ అన్నారు. శనివారం టేక్మాల్ బస్టాండ్ ఆవరణ నుండి ర్యాలీగా బయలుదేరి గాంధీభవన్, అంగడి బజార్ నుండి అంబేద్కర్ విగ్రహం వద్దకు వచ్చారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి 420 హామీలను నెరవేర్చాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, గద్దెనెక్కిన సంవత్సర కాలం ప్రజలు ఓపిక పట్టారని, ఇక ప్రజలు ప్రశ్నించే, సమయం వచ్చిందని ప్రజల్లో తిరిగే దమ్ము మంత్రులు, ఎమ్మెల్యేలకు ఉందా అని ఆయన ప్రశ్నించారు. నియోజకవర్గంలో తిరగడానికి నాయకులు మొఖం చాటేస్తున్నారని, కార్యకర్తలకు అందుబాటులో ఉండకుండా, మంత్రి తిరుగుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా ఇస్తామన్న హామీలను అమలు చేయాలని, పెంచిన పెన్షన్ 400, పెట్టుబడి సాయం 1500, కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్, లక్ష రూపాయలతో పాటు తులం బంగారం, వికలాంగులకు రూ.5000, ఇంటి స్థలంతో పాటు, 5 లక్షల రూపాయలు ఇంటి నిర్మాణానికి ఖర్చు, నిరుపేదలకు భూ పంపిణీ, వంటి అనేక హామీలను ఇచ్చారన్నారు. వాటిని అమలు చేయకుంటే ప్రజల పక్షాన ప్రశ్నిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు జైపాల్ రెడ్డి, డిబి నాగభూషణం టేక్మాల్ పీఏసీఎఫ్ చైర్మన్ యశ్వంత్ రెడ్డి, సిద్దన్న భాస్కర్, గోవిందా చారి, సుధాకర్, చాపల వెంకటేశం, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు భక్తుల వీరప్ప, చింతా రవి,, సలావుద్దీన్, రజాక్, బన్నయ్య మల్లేశం, వేల్పుగొండ మాజీ సర్పంచ్ నారాయణ, రమేష్ నాయక్, రాజు, ఉన్నారు.



జడ్పీహెచ్ఎస్ బూరుగుపల్లిలో విజ్ఞాన ప్రదర్శన



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ మండలం బూరుగుపల్లి గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టీవైఆర్ ఫౌండేషన్ విజ్ఞాన దర్శిని కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంకు టీవైఆర్ ఫౌండేషన్ చైర్మెన్ ప్రముఖ న్యాయవాది టీ.రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ ఫౌండేషన్ ద్వారా గజ్వేల్ పట్టణ ప్రభుత్వ పాఠశాలలకు గ్రంథాలయ పుస్తకాలు బీరువాలు అందిస్తున్నామన్నారు. అనంతరం విజ్ఞాన దర్శిని రాష్ట్ర అధ్యక్షులు రమేష్ సమాజంలో జరుగుతున్న మూఢనమ్మకాలు ఆచారాలు వాటిని నిర్మూలించుటకు పలు విజ్ఞాన ప్రదర్శన కార్యక్రమం ఏర్పాటు చేసి విద్యార్థులను చైతన్య పరిచారు. ఈ కార్యక్రమంలో టీవైఆర్ ఫౌండేషన్ కోఆర్డినేటర్ విజయలక్ష్మి, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్వీ క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే హరీశ్ రావు

నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండలం మగ్దూంపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి బొల్లు నాగరాజ్ యాదవ్ రూపొందించిన బీఆర్ఎస్వీ నూతన క్యాలెండర్ మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్ రావు శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్ డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్, బీఆర్ఎస్వీ విద్యార్థి విభాగం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నేత్రాలు సేకరణ



నవతెలంగాణ-సిద్దిపేట

అలయన్స్ క్లబ్ గవర్నర్ బాలచంద్రం ఆధ్వర్యంలో స్థానిక పారుపల్లి స్ట్రీట్‌లోని మహంకాల శ్రీనివాస్ తల్లి అన్నపూర్ణ ఈరోజు ఉదయం స్వర్గస్తులు కాగా, వీరి కుమారుడు, కుటుంబ సభ్యుల సలహా మేరకు నేత్రాలను సేకరించి, హైదరాబాద్ ఎల్.వి.ప్రసాద్ ఆసుపత్రికి పంపించినట్లు అలయన్స్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్మెన్ ఆత్మ రాములు తెలిపారు. ఈ కార్యక్రమంలో అలయన్స్ సభ్యులు అంజయ్య, మధుసూదన్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అండర్-17 కబడ్డీలో ఆదర్శ రాణింపు

-విద్యార్థులను అభినందించిన బోధన సిబ్బంది



నవతెలంగాణ-బెజ్జంకి


వరంగల్ జిల్లా మహబూబాబాద్ కేసముద్రంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్-17 కబడ్డీలో మండల కేంద్రంలోని ఆదర్శ విద్యాలయ విద్యార్థులు రాణించినట్టు పీడీ కనుకారెడ్డి శనివారం తెలిపారు. విద్యార్థులు ఎల్, రేణుకా, ఎస్.కృష్ణవేణి,కే.శరణ్య, ఎల్.గణేశ్, ఎల్.సాయిచరణ్, టీ.రాంచరణ్, ఏ.రుత్విక్ అండర్ 17 కబడ్డీలో పాల్గొని రాణించారని పీడీ తెలిపారు. విద్యార్థులను విద్యాలయ భోధన సిబ్బంది అభినందించినట్టు పీడీ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నవతెలంగాణ-సిద్దిపేట

ఆదివారం 11కేవీ టౌన్ పీఎస్ ఫీడర్ కింద విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్ రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ లైన్ నిర్వహణ, చెట్ల కొమ్మలను కత్తిరించే పని ఉన్నందున ఉదయం10 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు అంతరాయం ఉంటుందని తెలిపారు. మెదక్ రోడ్డు, వన్ టౌన్ పీఎస్, గాంధీ నుంచి కమాన్ రోడ్డు, చార్వాడన్, మంగమాతోట, బురుజు ప్రాంతం, కాంచారి బజార్, అరకోట్, మోయిన్‌పుర ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. ప్రజలు, వ్యాపారులు సహకరించాలని కోరారు.


ఆలయ మహిళా గోష్ఠి ఆధ్వర్యంలో కూడారై ఉత్సవం



నవతెలంగాణ-సిద్దిపేట

పాత వెంకటేశ్వర దేవాల యంలో శనివారం ఆలయ మహిళా గోష్ఠి వారి ఆధ్వర్యంలో 108 గంగాలలో మహా ప్రసాద నివేదన కార్యక్రమము నిర్వహిం చారు. అనంతరం ఆలయ, శ్రీ వేంకటేశ్వర స్వామి సేవా సమితి కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆదివారం ఉదయం 10 గంటలకు ఆలయములో గోదా రంగనాయక కళ్యాణం ఉన్నదని, భక్తులు హాజరు అయ్యి, తిలకించి ఆశీస్సులు పొందాలని కోరారు.

జాలపల్లిలో క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-మద్దూరు

దూల్మిట్ట మండలంలోని జాలపల్లి గ్రామంలో దూల్మిట్ట సర్పంచ్ల ఫోరం మాజీ అధ్యక్షురాలు చొప్పరి వరలక్ష్మి సాగర్, తన సొంత ఖర్చులతో క్యాలెండర్‌ను ముద్రించి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నూతన సంవత్సరం సందర్భంగా గ్రామంలోని ప్రజలందరికీ క్యాలెండర్ అందించాలనే సదుద్దేశంతో క్యాలెండర్‌ను ముద్రించి ప్రజలకు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-నంగునూరు

మండలంలో సిద్దన్నపేట గ్రామంలో ఇటీవలే దేవులపల్లి ఎల్లవ్వ మృతి చెందిన విషయం తెలిసిందే. పేద కుటుంబ పరిస్థితి గురించి గ్రామస్తులు విషయాన్ని ఫోన్‌లో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావుకు తెలియజేశారు. మాజీ మంత్రి ఆదేశాల మేరకు మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి ద్వారా రూ.5 వేలను పంపించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సంగు పురేందర్, డాకూరి భాస్కర్ రెడ్డి, బెదురు మల్లేశం, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బండి మల్లేశం, వంగర మల్లారెడ్డి, బండి ప్రశాంత్, కందికట్ల కనకయ్య, దేవులపల్లి రాజారావు, సంపత్ తదితరులు పాల్గొన్నారు.


టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో నవోదయ మోడల్ టెస్ట్



నవతెలంగాణ-గజ్వేల్

టీపీటీఎఫ్ గజ్వేల్ జోన్ ఆధ్వర్యంలో నవోదయ మోడల్ టెస్టును జోన్ కార్యాలయంలో నిర్వహించారు. దీనిలో 57 మంది వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ప్రధాన కార్యదర్శి సుంచు నరేందర్, రాష్ట్ర కౌన్సిలర్ రాజులు హాజరై మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థుల లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి ఈ పోటీ పరీక్షలు ఉపయోగ పడతాయన్నారు. అనంతరం పోటీ పరీక్షలో ప్రతిభను చాటిన విద్యార్థులు ఆరాధ్య, సంహిత, యుధిష్ఠ, వినయ్, మనస్విని లకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జోన్ కన్వీనర్ శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు పాపి రెడ్డి, గజ్వేల్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తాళ్ల నాగరాజు, విద్యాసాగర్, మర్కుక్ ములుగు మండల ప్రధాన కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తూ ఇల్లు దగ్ధం



నవతెలంగాణ- తొగుట

ప్రమాద వశాత్తూ ఇల్లు దగ్ధమైన సంఘటన మండ లంలోని చందా పూర్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్థుల, బాధితుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన నూనె మహేష్ ఇంట్లోని దేవుడికి దీపాంత లను ముట్టించారు. ప్రమాదవశాత్తు మంట పెద్దగా అయి అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఇల్లు చాలా వరకు కాలిపోవడంతో ఇంట్లో ఉన్న సామాను పూర్తిగా కాలిపోయని అవేదన వ్యక్తం చేశారు. గ్రామ ప్రజలు ఎంత చల్లార్చిన చల్లారకపోవడంతో ఫైర్ ఇంజన్ కు సమాచారం అందించారు. గజ్వేల్ నుంచి ఫైర్ ఇంజన్‌తో మంటలను పూర్తిగా ఆర్పి వేశారన్నారు. ఈ ప్రమాదంలో నిత్య అవసర వస్తువులతో సహా పూర్తిగా బట్టలు ఇంట్లో ఉండే సామాను పూర్తిగా కాలిపోయాయి. బియ్య పు డబ్బాలో 8 తులాల బంగారం , 25 తులాల వెండి గొలుసులు. రూ. 3 లక్షల 80 వేలు పూర్తిగా కాలిపోయాయి. ఫైర్ ఇంజన్ ఏఎల్ఎఫ్ శ్రీనివాసులు, ఫైర్ మాన్ శివకుమార్, హెూంగార్డు స్వామి, ఫైర్ ఇంజన్ డ్రైవర్ సతీష్, పూర్తిగా మంటలను ఆర్పివేశారు.

ముగ్గుల పోటీలో అక్కన్నపేట మహిళ ప్రతిభ



నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండలం జనగామ గ్రామానికి చెందిన రమాదేవి అనే మహిళ ముగ్గుల పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి మొదటి ఐదుగురిలో స్థానం సంపాదించింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జంగపల్లి ఐలయ్య ఆమెను అభినందించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ బైకాని శ్రీనివాస్, కరెంటోతూ రవి, కుందన్ వానిపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు లింగంపల్లి సారయ్య, గౌరవెల్లి మాజీ ఎంపీటీసీ బైరగోని శ్రీనివాస్, యూత్ నాయకులు నందారపు సంపత్, ఏపీఎం శ్రీనివాస్, సీసీలు శివ, రాజు, తదితరులు, పాల్గొన్నారు.

దశాబ్ద కల ఫలించేనా.?

- నూతన గ్రామ పంచాయతీగా పర్శరాంనగర్.!








నవతెలంగాణ-దుబ్బాక

కొత్త గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలంటూ దశాబ్ద కాలంగా ఎదురుచూస్తున్న కళ నెరవేరబోతుందన్న ఆశలు పర్శరాంనగర్ గ్రామ ప్రజల్లో చిగురిస్తున్నాయి. 350 పైచిలుకు జనాభా, 250 మంది ఓటర్లు కలిగి పూర్తిగా వ్యవసాయధారిత ప్రాంతం, జిల్లా సరిహద్దు గ్రామం కావడంతో పర్శరాంనగర్ అభివృద్ధిలో వెనుకబడిపోయింది. పంచాయతీ కార్యాలయానికి దూరంగా ఉండడంతో ఏళ్ల తరబడి తమ గ్రామాన్ని నూతన పంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరుతూ ఆ గ్రామ ప్రజలు పలుమార్లు ప్రజా ప్రతినిధులకు, ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేశారు. దశాబ్ద కాలంగా నిరీక్షిస్తున్న తరుణంలో రాష్ట్రంలో నూతన గ్రామ పంచాయతీల ఏర్పాటుకు ప్రత్యేక ఆర్డినెన్స్ జీవో చేసి గవర్నర్ ఆమోదముద్ర వేసిన తర్వాత ప్రభుత్వం కొత్త గ్రామ పంచాయతీలకు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసేందుకు సిద్ధమైంది. సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఇటీవలే జరిగిన మంత్రివర్గ సమావేశంలో 200 కొత్త గ్రామపంచాయతీలు, 11 నూతన మండలాలను ఏర్పాటు చేసేందుకు పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిసింది. రాష్ట్రంలో త్వరలో గ్రామపంచాయతీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పాత గ్రామపంచాయతీలతో పాటు కొత్తగా ఏర్పాటవబోతున్న గ్రామపంచాయతీలను కలిపి ఒకేసారి పంచాయతీ ఎన్నికలు నిర్వహించేలాగా అధికారులు ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం. పలు గ్రామాలు పంచాయతీ కార్యాలయాలకు దూరంగా ఉండటం వల్ల పాలనాపరంగా అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో అభివృద్ధి పనుల విషయంలో తమ గ్రామాల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ మధిర గ్రామాల ప్రజల ఆరోపిస్తున్నారు. కొత్త పంచాయతీగా ఏర్పాటైతే దూరభారం తగ్గుతుంది. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ప్రత్యేక ఫండ్స్ రావడం వల్ల గ్రామం అభివృద్ధి చెందే అవకాశం ఉంది. అయితే గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా నిలబడి ఓట్లు అడిగేందుకు వచ్చిన అభ్యర్థుల ముందు సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం అచ్చుమాయిపల్లి మధిర గ్రామం పర్శరాంనగర్ (జోడిచర్ల), పద్మశాలి గడ్డ పంచాయతీలోని నర్లెంగడ్డ ప్రజలు ఇదే డిమాండ్ పెట్టారు. దీంతో వారు తమను గెలిపిస్తే మధిర, అనుబంధ గ్రామాలను నూతన గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పుడు ఆ హామీని నిలబెట్టుకునే ప్రయత్నంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఈ రెండు గ్రామాలను నూతన పంచాయతీలుగా ఏర్పాటు చేయాలంటూ

రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఇటీవలే ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్చార్జి మంత్రి కొండా సురేఖ, జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి సీతక్కలను కలిసి విన్నవించారు. ఎమ్మెల్యే ప్రతిపాదనకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి సానుకూలత వచ్చింది. దీంతో దుబ్బాక మండలంలోని అచ్చుమాయిపల్లి మధిర గ్రామం పర్శరాంనగర్, పద్మశాలిగడ్డ పంచాయతీలోని నర్లెంగడ్డ గ్రామాలను నూతన పంచాయితీలుగా ఏర్పాటు చేసే ప్రక్రియ మొదలైంది.

ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డికి కృతజ్ఞతలు




గత పదేళ్లుగా తమ గ్రామాన్ని నూతన పంచాయతీగా ఏర్పాటు చేయాలంటూ ప్రభుత్వానికి అనేకమార్లు వినతి పత్రాలను అందజేశాం. నేడు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ప్రత్యేక చొరవతో తమ గ్రామం నూతన పంచాయతీగా ఏర్పాటు కాబోతుండడం సంతోషకరం. ఇందుకు ఎమ్మెల్యేకి పర్శరాంనగర్ గ్రామ ప్రజల తరపున కృతజ్ఞతలు.

-పర్స దేవరాజు ముదిరాజ్, అచ్చుమాయిపల్లి మాజీ ఉపసర్పంచ్

'చేనేత కార్మికులకు అభయహస్తం' పథకం పట్ల హర్షం

- టీపీసీసీ చేనేత వీవర్స్ సెల్ అధ్యక్షులు గూడూరు శ్రీనివాస్
- సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



నవతెలంగాణ-సిద్దిపేట

రాష్ట్రంలోని చేనేత, మరమగ్గాల కార్మికుల సంక్షేమం కోసం, వారి అభివృద్ధికి వివిధ పథకాల అమలు కోసం సీఎం రేవంత్ రెడ్డి ఈ నెల 9న తెలంగాణ చేనేత అభయ హస్త పథకం ప్రారంభించారని, గత బీఆర్ఎస్ పాలనలో చేనేతలకు అన్యాయం జరిగిందని టీపీసీసీ చేనేత వీవర్స్ సెల్ అధ్యక్షులు గూడూరు శ్రీనివాస్ అన్నారు. శనివారం ఆయన ఆధ్వర్యంలో గాంధీ విగ్రహం వద్ద చేనేత కార్మికులతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ నేతన్న పొదుపు పథకం ద్వారా కార్మికులకు పొదుపు అలవాటును ప్రోత్సహించడం, సామాజిక భద్రత కల్పించడం ఈ పథకం యొక్క ప్రధాన లక్ష్యమని, కార్మికులు తమ వాటాగా 8 శాతం పొదుపు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం 16 శాతం వాటా మంజూరు చేస్తుందని అన్నారు. 2024-25 ఏడాదిలో నేతన్న పొదుపు పథకం పొదుపు విధి అమలుకు ప్రభుత్వం రూ.115 కోట్లు బడ్జెట్ కేటాయించారని తెలిపారు. 2024 25 ఏడాదిలో రూ.9 కోట్ల బడ్జెట్ కేటాయించారని తెలిపారు. ఒక ఏడాదికి ఒక్కొక్క చేనేత కార్మికునికి రూ.6వేల వరకు మంజూరు చేయడం జరుగుతుందని, రూ. 44 కోట్ల బడ్జెట్ కేటాయించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ చేనేత సంఘాలు అధ్యక్ష, కార్యదర్శులు, కార్మికులు పాల్గొన్నారు.

చేర్యాలలో పోస్ట్ మెట్రిక్ హాస్టల్‌ను ఏర్పాటు చేయాలి

- ఎమ్మెల్యే పల్లాకు ఎస్ఎఫ్ఐ నాయకుల వినతి



నవతెలంగాణ-చేర్యాల

చేర్యాలలో పోస్ట్ మెట్రిక్ హాస్టల్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం చేర్యాల పట్టణ కేంద్రంలో జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు ఆముదాల రంజిత్ రెడ్డి మాట్లాడుతూ సుమారు 700 నుంచి 900 మంది విద్యార్థులు చేర్యాల మండల కేంద్రంలో విద్యానభ్యసి స్తున్నారని, పోస్ట్ మెట్రిక్ హాస్టల్‌ను ఏర్పాటు చేస్తే విద్యార్థులకు అందుబాటులో ఉండి నాణ్యమైన విద్య అందుతుందని తెలిపారు. తక్షణమే ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. పోస్ట్ మెట్రిక్ హాస్టల్ ఏర్పాటు కోసం కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎస్ఎఫ్ఐ చేర్యాల డివిజన్ కార్యదర్శి తాడూరి భరత్ కుమార్, డివిజన్ నాయకులు తాడూరి విక్రమ్, లెనిన్, రాకేష్ ఉన్నారు.

మల్లన్న ఆలయాన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నాం

- దుబ్బాక నియోజవర్గ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి





నవతెలంగాణ-తొగుట

కోరుకున్న భక్తులకు కోరికలు తీరుస్తూ కొంగు బంగారమైన సింగరాల మల్లన్న ఆలయాన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని కాంగ్రెస్ దుబ్బాక నియోజవర్గ ఇంచార్జీ చెరుకు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం మండలం జప్తి లింగారెడ్డి పల్లి సింగరాల మల్లన్న దేవాలయం వద్ద రూ.23 లక్షల నిర్మాణం చేసిన సీసీ రోడ్లు, ఐమాక్స్ స్ట్రీట్ లైట్స్ ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోరుకున్న భక్తులకు కోరికలు తీరుస్తూ కొంగు బంగారమైన సింగరాల మల్లన్న ఆలయానికి అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గాంధారి లతా నరేందర్ రెడ్డి, మండల అధ్యక్షులు ఆక్కం స్వామి, మాజీ సర్పంచ్ చిలివేరి రాంరెడ్డి, మల్లారెడ్డి, నాయకులు తదితరాలు పాల్గొన్నారు.

ఉత్కంఠబరితంగా బీజేపీ మండలాధ్యక్షుడి ఎన్నిక

- రెండో దఫా ఎన్నికైన కొలిపాక రాజు



నవతెలంగాణ-బెజ్జంకి

కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని అయా మండలాల నూతన అధ్యక్షుల ఎన్నికలో పారదర్శకంగా వ్యవహరించాలనే సదుద్దేశ్యంతో కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ త్రీ సభ్య కమిటీ ఏర్పాటు చేశారు. దీంతో బీజేపీ నూతన మండలాధ్యక్షుడి ఎన్నికలో హెూరాహెూరి పోటీ నెలకొని తీవ్ర ఉత్కంఠకు తెరపడింది. నూతన మండలాధ్యక్షుడిగా కొలిపాక రాజు రెండో దఫా ఎన్నికైయ్యారు. శనివారం కరీంనగర్ జిల్లా కేంద్రంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, సూర్యాపేట మాజీ ఎమ్మెల్యే, ఎన్నికల అధికారి సంకినేని వెంకటేశ్వర్ రావు కొలిపాక రాజుకు నూతన మండలాధ్యక్షుడిగా నియామకపత్రం అందజేశారు. తన ఎన్నికకు సహకరించిన కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి, ఎంపీ బండి సంజయ్ కుమార్, జిల్లాధ్యక్షుడు గంగాడి క్రిష్ణారెడ్డి, మండల ఎన్నికల అధికారి సంపత్ రావు,జిల్లా నాయకులు బాస సత్యనారాయణ,కోమలి అంజన్న, బోయినిపల్లి ప్రవీణ్ రావు, కరివేద మహిపాల్ రెడ్డి, చాడా వేంకట రెడ్డి, మాడ వెంకట రెడ్డి, గుర్రాల వేంకట రెడ్డి, ఇనుగొండ నాగేశ్వర్ రెడ్డి,సొల్లు అజయ్ వర్మమండల నాయకులు,బూత్ అధ్యక్షులు, కార్యకర్తలకు కొలిపాక రాజు కృతజ్ఞతలు తెలిపారు.

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు

- 21మందికి రూ.22వేలు500 జరిమానా
- గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళి



నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళి అన్నారు. శనివారం మద్యం సేవించి వాహనాలు నడిపిన 21 మందికి జరిమాన విధించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ మురళి మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు అధికమయ్యాయన్నారు. గజ్వేల్ ట్రాఫిక్ పోలీసుల వాహన తనిఖీలలో మద్యం సేవించి వాహనాలు నడిపిన 21 మందికి, రూ.22వేలు 500 జరిమానా విధించారు. సిబ్బందితో గత కొన్ని రోజుల గజ్వేల్ పట్టణంలో పిడిచెడ్, క్యాసారం ఎక్స్ రోడ్, తూప్రాన్ రోడ్, ముట్రాజ్ పల్లి రోడ్డు, సంగాపూర్ రోడ్, ఔటర్ రింగ్ రోడ్డు ప్రాంతాల్లో వాహనాలు తనిఖీ నిర్వహించ మన్నారు. 21మంది వ్యక్తులు మద్యం సేవించి వాహ నాలు నడుపుతుం డగా బ్రీత్ ఎనలైజర్ తో నిర్ధారణ చేశామ న్నారు. గజ్వేల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ప్రియాంక ముందు హాజరుపర చగా విచారణ చేసి జరిమాన, ఓ వ్యక్తి కి జైలు శిక్ష విధించా రన్నారు. రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు పాటించి వాహనాలు నడపాలని కోరారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం మాత్రమే ప్రతిరోజు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్దే కాంగ్రెస్ లక్ష్యం


- వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించిన పూజల హరికృష్ణ



నవతెలంగాణ-సిద్దిపేటరూరల్

గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని సిద్దిపేట నియోజకవర్గ ఇన్చార్జి పూజల హరికృష్ణ అన్నారు. శనివారం నారాయణరావుపేట మండల కేంద్రంలోని అంగన్వాడీ భవనంకు రూ . 8 లక్షలు, లక్ష్మీదేవి పల్లి గ్రామంలో డ్రైనేజీ నిర్మాణానికి రూ .10 లక్షలు కోదండరావు పల్లి గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణంకి రూ.5 లక్షల ఈజీఎస్ నిధులతో వివిధ అభివృద్ధి పనులకు అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామం ప్రతి పల్లె అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రజలకు మౌలిక వసతులు కల్పించడం ప్రభుత్వ ముఖ్య లక్ష్యం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షులు బర్మా రామచంద్రం, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కాలీముద్దీన్, జిల్లా అధికార ప్రతినిధి బుచ్చి రెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మంద పాండు, జిల్లా మహిళా అధ్యక్షురాలు ముద్దాం లక్ష్మి , డీసీసీ ప్రధాన కార్యదర్శి రాజు వీర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

20వ వార్డు కౌన్సిలర్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు



నవతెలంగాణ-సిద్దిపేట

సంక్రాంతి పండుగ సందర్భంగా 20వ వార్డు కౌన్సిలర్ మహమ్మద్ రియాజుద్దిన్ ఆధ్వర్యంలో శనివారం ముగ్గుల పోటీలు కాలనీవాసులకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు తెలియజేయడానికి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అవసరమన్నారు. ముఖ్య అతిథులుగా డాక్టర్ అరుణ, 37 వ వార్డు కౌన్సిలర్ సాకి బాల్ లక్ష్మి ఆనంద్, ఇక్ర ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపల్ ఆయేశాలు ముగ్గులను పరిశీలించి విజేతలకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ మంద వనజ, వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పి రేట్ల సంతోష, భవానీ, వార్డు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

కాకతీయలో ఘనంగా సంక్రాంతి సంబరాలు



నవతెలంగాణ-సిద్దిపేట

కాకతీయ టెక్నో హైస్కూల్లో విద్యార్థుల తల్లిదం డ్రులు, విద్యార్థులు సంక్రాంతి సంబరాల్లో భాగంగా ముగ్గుల పోటీల్లో పాల్గొ న్నారు. భోగి మంటలు, పాలు పొంగించడం, 20 రకాల పిండి వంటలతో ఎగ్జిబిషన్ నిర్వ హించ డం, కైట్ ఫెస్టివల్, గంగిరెద్దుల విన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిం చి, హౌరా అనిపించారు. ముఖ్య అతిథిగా కరీంనగర్ టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి జగ్గు మల్లారెడ్డి హాజరై మాట్లాడుతూ మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ముగ్గులు వేసి, వారి నైపుణ్యాన్ని వెలికి తీసుకోవడం, మన సంస్కృతి సంప్రదా యాన్ని తెలపడం అభినందనీయమన్నారు. ముగ్గుల పోటీల్లో పాల్గొని నగదు బహుమతులు గెలుచుకున్న మహిళలకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


సాగునీరు ద్వారాన్ని పరిశీలించిన ఏఎంసీ చైర్మెన్



నవతెలంగాణ-బెజ్జంకి

తోటపల్లి ఆన్ లైన్ రిజర్వాయర్ సాగు కాల్వ ద్వారా రైతుల పంటల సాగుకు నీరు విడుదలపై ఏఎంసీ చైర్మెన్ సంబంధిత అధికారులతో మాట్లాడారు. శనివారం మండల పరిధిలోని గాగీల్లపూర్ గ్రామ శివారులోని సాగు కాల్వ నీరు విడుదల ద్వారాన్ని ఏఎంసీ చైర్మెన్ పులి క్రిష్ణ పరిశీలించారు. పంచాయితీ కార్యదర్శి రాజేంద్ర ప్రసాద్, యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎర్రల రాజు, కాంగ్రెస్ గ్రామాధ్యక్షుడు పైడిపల్లి శంకర్, సంతోష్, రమేష్, సాగర్ పరిశీలనలో పాల్గొన్నారు.

గజ్వేల్‌లో లాల్ బహదూర్ శాస్త్రి విగ్రహావిష్కరణ



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ పట్టణంలో శనివారం హైందవ సోదరుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దివంగత నేత లాల్ బహదూర్ శాస్త్రి గుర్తింపు సందర్భంగా ఆయన విగ్రహం కూడా ఏర్పాటుచేసి ఆవిష్కరణ చేపట్టారు. అదేవిధంగా వర్ధంతి సందర్భంగా స్థానిక కోర్టు సమీపంలో విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, ఎఫ్డీసీ మాజీ చైర్మెన్ ప్రతాపరెడ్డి, మున్సిపాల్ చైర్మెన్ రాజమౌళి, మార్కెట్ కమిటీ చైర్మెన్ నరేందర్ రెడ్డి, వైస్ చైర్మెన్ సర్దార్ ఖాన్, మున్సిపల్ మాజీ చైర్మెన్ గాడి పల్లి భాస్కర్, నాయకులు,హైందవ సోదరులు, తదితరులు పాల్గొన్నారు

సమస్యల పరిష్కారంకు ఆత్మహత్యలు సరికాదు



నవతెలంగాణ-గజ్వేల్

సమస్యల పరిష్కారం కావడానికి ఆత్మహత్యలు చేసుకోవడం సరికాదని మున్సిపల్ చైర్మెన్ నేతి చిన్న రాజమౌళి అన్నారు. శనివారం మున్సిపల్ పరిధిలోని 1వ వార్డు చెందిన ఎర్రవాడ ఆంజనేయులు ఆత్మహత్య చేసుకోక గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రిలో మృతదేహాన్ని పరిశీలించారు. ఆయన కుటుంబానికి సానుభూతి వ్యక్తం చేశారు. ఆత్మహత్యలు చేసుకోవడం వల్ల కుటుంబాలు చిన్నాభిన్నం అవుతాయన్నారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ చందు, వార్డు పెద్దలు బాకీ స్వామి, నాగరాజు, కర్ణాకర్, అరవిందు, రవి, జైహిర్ రాకేష్, బన్నీ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

16న కూడవెల్లి జాతర టెండర్లు

నవతెలంగాణ-దుబ్బాక

అక్బర్ పేట-భూంపల్లి మండలం రామేశ్వరంపల్లిలోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం వద్ద ఈ నెల 29 నుంచి జరిగే కూడవెల్లి జాతరకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను ఈ నెల 16న నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ విశ్వనాథశర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 6 న ప్రసాదాలకు రూ.5.35 లక్షలు పలికిందని, కొబ్బరికాయలు మిగిలిన ఆదాయ,వ్యయ టెండర్లను ఈ నెల 16న నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ప్రకటనలో పేర్కొన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసానికి, శరీర దృఢత్వానికి దోహదం

-జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

నవతెలంగాణ-కొమురవెల్లి



క్రీడలు మానసిక ఉల్లాసానికి శరీర దృఢత్వానికి దోహదం చేస్తాయని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో బీఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాలీబాల్ టోర్నమెంట్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటలు ఆడడంతో యువతకు శారీరక దృడత్వం ఏర్పాడడంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందన్నారు. దేశానికి ఎంతో మంది వాలీబాల్ క్రీడాకారులను ఉమ్మడి వరంగల్ జిల్లా అందించిందని గుర్తు చేశారు. చిన్న మండలంలో 22 వాలీబాల్ టీంలు ఉండడం సంతోషకరమైన విషయమని అన్నారు. ఆటలలో గెలుపుఓటములు సహజమని. ఆటలలో పాల్గొనడమే గొప్పవిజయమని అన్నారు. మండలంలో యువతకు మనాసిక ఉల్లాసంకోసం ఆటలు నిర్వహిస్తున్న బీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మెన్ బొంగు రాజేందర్ రెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ కాయిత రాజేందర్ రెడ్డి, నాయకులు తలారి కిషన్, వకులాభరణం నర్సయ్య, నాగమల్ల సత్యనారాయణ, నాగమల్ల బిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలుగా ముద్దం లక్ష్మి

నవతెలంగాణ-సిద్ధిపేట



కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలుగా ముద్దం లక్ష్మి మూడోసారి నియామకం అయ్యారని, పార్టీలో కష్టపడ్డ కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందని కాంగ్రెస్ సిద్ధిపేట నియోజకవర్గ ఇన్చార్జి పూజల హరికృష్ణ తెలిపారు. శనివారం కాంగ్రెస్ క్యాంప్ కార్యాలయంలో నియామక పత్రాన్ని లక్ష్మికి అందించి, కార్యకర్తలు ఆమెను శాలువాలతో సన్మానించి, స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీకి చేస్తున్న సేవలకు గుర్తింపుగా మూడోసారి తనకు ఈ పదవి రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ పదవి రావడానికి సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గంప మహేందర్ రావు, అత్తు ఇమామ్, వహీద్ ఖాన్, కలిముద్దీన్, సాకి ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఆర్ఐ సొంత నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం

నవతెలంగాణ-చేర్యాల



చేర్యాల మండలం ముస్త్యాల గ్రామంలోని పంచాయతీ కార్యాలయం, నూతనంగా నిర్మిస్తున్న గ్రంథాలయ భవనం వద్ద అదే గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ డాక్టర్ పెడుతల ప్రతాప్ రెడ్డి బాలమణి రెడ్డి తమ సొంత నిధులు రూ.2 లక్షల 50 వేల తో శనివారం సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ పెడుతల ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీ మహిళ మృతి

నవతెలంగాణ-నంగునూరు



ఫైల్

కారు ఢీ కొని మహిళ మృతి సంఘటన పాలమాకుల గ్రామంలో చోటు చేసుకుంది. రాజగోపాల్ పేట ఎస్సై అసిఫ్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం మధ్యాహ్నం పాలమాకుల గ్రామంలో ఎన్ హెచ్ 765 డీజీ రోడ్ పక్కన ముంద్రాతి లక్ష్మి (57) నిలబడి ఉండగా సిద్దిపేట వైపు నుంచి హుస్నాబాద్ వైపు వెళ్తున్న మారుతీ ఎస్ టీఎస్ 36 జే 3969 కారు ఢీ కొట్టింది. హుస్నాబాద్ చెందిన కారు డ్రైవర్ గుర్రాల లింగారెడ్డి అతివేగంగా, అజాగ్రత్తగా నడిపి టక్కరు ఇవ్వగా తలకు బలమైన గాయం అయిందని తెలిపారు. లక్ష్మి నిసిద్ధిపేట ప్రభుత్వ ఆసుపత్రి కి తీసుకొని వెళ్లగా చికిత్స పొందుతూ చనిపోయిందని చెప్పారు. మృతురాలి చిన్న కుమారుడు ముంద్రాతి వేణు వర్ధన్ ఫిర్యాదు ఇవ్వగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

తిమ్మాయి పల్లిలో ముగ్గుల పోటీల నిర్వాహణ

నవతెలంగాణ-నంగునూరు



నంగునూరు మండలం తిమ్మాయి పల్లి గ్రామంలో సంక్రాంతి పండుగ పురస్కరిం చుకొని గ్రామపంచాయతీ, మహిళా సంఘాల ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ ఆవరణలో శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతిగా మోతుకు అన్విక శ్రీ, రెండవ బహుమతిగా పిల్లి ప్రవళిక, మూడవ బహుమతిగా రంగధాం వైష్ణవి ని ఎంపికచేసి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ తాజా సర్పంచ్ ఎలా లతా కృష్ణ, గ్రామపంచాయతీ కార్యదర్శి గౌస్ ఉద్దీన్, సీసీ బాలకిషన్ గౌడ్, సీఏ పరశురాములు, తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీ..యువకునికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-రాయపోల్



గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకునికి తీవ్ర గాయాలైన సంఘటన రాయపోల్ మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. రాయపోల్ పోలీసుల కథనం ప్రకారం.. గజ్వేల్ మండలం ధర్మారెడ్డి పల్లి గ్రామానికి చెందిన మహమ్మద్ మునీర్ శనివారం గజ్వేల్ నుంచి దౌల్తాబాద్ వైపు వెళుతున్న క్రమంలో రాయపోల్ జెడ్పీహెచ్ఎస్ వద్ద మూలమలుపు మీద దౌల్తాబాద్ నుంచి గజ్వేల్ వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ద్విచక్ర వాహనంపై మహమ్మద్ మునీర్‌తో పాటు మరో యువకుడు ఉన్నాడు. ఈ ప్రమాదంలో మునీర్ తీవ్ర గాయాలపాలయ్యాడు. వెంటనే 108 వాహనంలో మునీర్‌ను గజ్వేల్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స అనంతరం యువకుడికి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. యువకులు పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

పాఠశాలలు నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-సిద్దిపేట



సంక్రాంతి సెలవుల్లో పరీక్షల పేరిట పాఠశాలలు నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ సిద్దిపేట పట్టణ కమిటీ కార్యదర్శి బత్తుల అభిషేక్ భాను విద్యాశాఖ అధికారులను డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని నారాయణ పాఠశాల పరీక్షల పేరుతో నడుస్తున్నాయని, దానిని బై కట్ చేసి, ఎంఈఓ కు ఫిర్యాదు చేయడం జరిగింది అన్నారు. అధికారులు సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్న వారిపై జట్టి పరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

లయన్ అమర్నాథ్ రావుకు ఘన సన్మానం

నవతెలంగాణ-గజ్వేల్



గజ్వేల్ లయన్స్ క్లబ్ ఆఫ్ గజ్వేల్ స్నేహ ఆధ్వర్యంలో 2025-26 ఏడాదికి డిస్ట్రిక్ట్ గవర్నర్‌గా కాబోతున్న లయన్ అమర్నాథ్ రావును శనివారం లయన్స్ క్లబ్ మాజీ ప్రెసిడెంట్ సత్యనారాయణ టీచర్ లయన్స్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా టీచర్ సత్యనారాయణ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో తమ జీవితాన్ని ప్రారంభించి కృషి, పట్టుదలతో నిరంతరం సమాజ సేవలో పాల్గొంటూ మా ఉపాధ్యాయ వర్గం నుంచి లయన్ డిస్ట్రిక్ట్ చరిత్రలో మొట్టమొదటిసారిగా డిస్టిక్ గవర్నర్ కాబోతున్న అమర్నాథ్ రావుకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రీజినల్ చైర్మన్ గోలి సంతోష్, జోన్ చైర్మన్ నేతి శ్రీనివాస్ గుప్తా, లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ అధ్యక్షుడు మల్లేశం గౌడ్, కోశాధికారి దొంతుల సత్యనారాయణ, లయన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రికెట్ పోటీలు

నవతెలంగాణ-సిద్ధిపేట



స్థానిక ప్రొఫెసర్ జయశంకర్ మినీ స్టేడియంలో గడ్డం శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో సిఎం రేవంత్ రెడ్డి క్రికెట్ కప్ టోర్నమెంట్ హెూరాహెూరీగా సాగుతున్నాయి. శనివారం చింతమడక, పుల్లూరు జట్లు తలపడగా, పుల్లూరు 5 వికెట్ల తేడాతో గెలుపొందగా, ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ యోగి వరించింది. రెండవ మ్యాచ్ లో అక్కినపల్లి, రాఘవపూర్ జట్ల మధ్య జరుగగా, అక్కినపల్లి 42 రన్స్ తేడాతో గెలవగా, ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ శివ కుమార్ అందుకున్నారు. మూడో మ్యాచ్‌లో రాముని పట్ల, చౌడారం జట్ల మధ్య జరుగగా, రాముని పట్ల 6 రన్స్ తేడాతో గెలిచింది. ఇందులో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ ఎండి షాదుల్ దక్కించుకున్నాడు. నాలుగో మ్యాచ్ అల్లిపూర్, వెల్కటూరు జట్ల మధ్య జరుగగా, వెల్కటూరు 9 రన్స్ తేడాతో గెలిచింది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ ప్రశాంత్ దక్కించుకున్నాడు. ఈ కార్యక్రమంలో తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ సిద్ధిపేట జిల్లా అధ్యక్షులు చెంది రెడ్డి నరేందర్ రెడ్డి, శివకుమార్ రెడ్డి, నరేష్, బాబ్జి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కొండగట్టులో పూజలు నిర్వహించిన అనిల్ మోగిలి

-నూతన వెబ్ సిరీస్ స్క్రిప్ట్ పూజ

నవతెలంగాణ-గజ్వేల్ రూరల్



కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయంలో గజ్వేల్ నియోజకవర్గానికి చెందిన సినీ హీరో అనిల్ మొగిలి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం నూతన వెబ్ సిరీస్ స్క్రిప్ట్ పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. సిద్దిపేట జిల్లా గద్దెలపల్లి గ్రామానికి చెందిన దర్శకులు మురళి వర్ధన్ జి, దర్శకత్వంలో చిత్రీకరణ జరుగుతున్నది. సస్పెన్స్ థ్రిల్లర్ వెబ్ సిరీస్ విజయవంతం కావాలని, సంబంధించిన స్క్రిప్ట్ కు సంబంధించి పూజా కార్యక్రమం కొండగట్టులో నిర్వహించారు.ఈ వెబ్ సిరీస్ చిత్రీకరణ రెగ్యులర్ షుటింగ్ మార్చ్ నుంచి ప్రారంభం కానుంది. ఈ చిత్రంలో అనిల్ మొగిలి, తులసి సీరియల్ ఫేమ్ నవీన్ గౌతమ్, హెబ్బా పటేల్ ముఖ్య తారాగాణంగా చిత్రీకరణ చేస్తున్నారు.

అధికారంతో అసైన్డ్...?

- మండలంలో అక్రమార్కుల ప్రధానాస్త్రం..
- గత ప్రభుత్వంలో వ్యవస్థలన్ని ఇదే తంతూ..
- ప్రభుత్వం దృష్టి సారిస్తేనే గాడిలోకి...





నవతెలంగాణ-బెజ్జంకి

గత ప్రభుత్వంలోని ప్రజాప్రతి నిధులు సిద్దిపేట జిల్లాలో కలిసిన అనంతరం మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు ప్రత్యేక కృషితో మండలం అభివృద్ధి సాధించిందని పలు సందర్భాల్లో ప్రసంగాలు చేశారు. సిద్దిపేట జిల్లాలో మండలం కలిసిన అంనంతరం అభివృద్ధి పేరునా గత ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రజా ధనాన్ని దోపిడీ చేసి అక్రమాలకు పాల్పడ్డారని మండల వ్యాప్తంగా విమర్శలు వినిపిస్తున్నాయి. గత ప్రభుత్వంలో అధికార పార్టీ నాయకులు విచ్చలవిడిగా అక్రమాలకు తెరలేపారని ఆరోపణలు న్నాయి. రంగమేదైనా దోపిడీయే ప్రథమ ప్రధానంగా నాయకులు వ్యవహరించారని చేపట్టిన అభివృద్ధి పనులే సాక్షత్తు దర్శనమిస్తున్నాయి.

ప్రభుత్వ భూముల అక్రమ పట్టాలు..

మండల కేంద్రంలోని రూ.కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూములను సంబంధిత అధికారుల కండ్లు గప్పి బీఆర్ఎస్ నాయకులు అక్రమంగా పట్టాలుగా మార్చుకున్నారని విమర్శలున్నాయి. మండల కేంద్రంలో రూ.కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని బీఆర్ఎస్ నాయకుల అండదండలతో అక్రమించుని భవన నిర్మాణం చేపట్టారని నానుడి. ప్రభుత్వ భూములను సైతం పట్టాలుగా మార్చుకున్నారనే అపవాదు వినిపిస్తోంది. కొందరు స్వాతంత్ర్య సమరయోదులకు, మరికొందరు ఎస్సీ సామాజిక వర్గాలకు గతంలో ప్రభుత్వం భూములు పట్టాలిచ్చినట్టు సమాచారం. పట్టాలందజేసిన కుటుంబ సభ్యులకు చెందాల్సిన ప్రభుత్వ భూమిని అధికారులు ఇతరులకు మ్యూటేషన్ చేసి పట్టాలు జారీ చేయడం చర్చనీయాంశమైంది. మండలంలో ప్రభుత్వ భూములపై అధికారుల పర్యవేక్షణ లేక అక్రమణకు గురవుతున్నాయని పలువురు బాహటంగానే చెబుతున్నారు.

విచ్చలవిడిగా వెంచర్లు..


మండల కేంద్రంతో పాటు రాజీవ్ రహదారి, పోతారం గ్రామంలో విచ్చలవిడిగా అక్రమ వెంచర్లు వెలిసాయి. ఏ ఒక్క వెంచరుకు ప్రభుత్వ అనుమతుల్లేవు. ఇటీవల పోతారం గ్రామంలో ఎలాంటి అనుమతుల్లేకండా వెలిసిన అక్రమ వెంచర్ పై అధికారులు తుతూ మంత్రంగా చర్యలు చేపట్టారు. కొద్ది రోజుల అనంతరం వెంచర్ వ్యాపారులు ప్లాట్లను విక్రయిస్తు న్నారని సమాచారం. అక్రమంగా వెలిసిన వెంచర్లకు అధికారులే అజ్యామిస్తున్నారని..సిద్దిపేట జిల్లాధికారులు సైతం చూసిచూడనట్టు వ్యవహరిస్తూ అక్రమార్కులకు వత్తాసు పలుకుతున్నారని గ్రామస్తులు వాపోతున్నారు.

యథేచ్ఛగా మట్టి, ఇసుక రవాణ..



మండలంలో రాత్రింబవళ్లు అక్రమ మట్టి రవాణ సాగింది. అధికారుల అనుమతుల పేరునా ఇసుక మాఫీయాదారులు ఇసుక రవాణను పక్కదారి పట్టించి అందినకాడికి దోచుకున్నారు. రేయింబవళ్లు మట్టి, ఇసుక రవాణ సాగుతున్న అధికారులు పట్టించుకోకపోవడంతో అధికారుల సమక్షంలోనే అక్రమ రవాణ సాగిందని ప్రజలు నేటికి ఆరోపిస్తున్నారు.

ఎర వేయడం..తాము అనుకున్నది ఎదైనా తమకనుగుణంగా మలుచుకోవడం. ఇది గత ప్రభుత్వంలో మండలంలోని పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు వ్యవహరించిన తీరు. అధికారంతో ప్రభుత్వ భూములు(లావుని),పట్ట భూములను అధికారంతో అసైన్డ్ చేసుకున్నారని మండలంలో ఆరోపనలు తలెత్తున్నాయి. మాముళ్లే ప్రధానాస్త్రంగా అధికారులపై అక్రమార్కులు ప్రదర్శించి ప్రభుత్వ భూములను పట్టాలుగా మార్చుకోవడం, ఇష్టారీతిన ఇసుక, మట్టి రవాణకు అజ్యామివ్వడం, అనుమతుల్లేని వెంచర్లకు వత్తాసు పలకడం,ప్రభుత్వం అందించే పలు సంక్షేమ పథకాలతో పాటు లోపాభూయిష్టంగా అభివృద్ధి పనుల నిర్మాణాలు చేపట్టి ప్రజాధనం దోపిడికి పాల్పడడం వంటివి కోకల్లుగా జరిగాయని విమర్శలు వెల్లువెత్తున్నాయి. గత ప్రభుత్వంలో అప్పటి అధికార పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు సంబంధిత అధికారులను గుప్పిట్లో పెట్టుకుని ఎంత అందితే అంత దోచుకున్నారనే విమర్శలు సైతం మండలంలో వినిపిస్తున్నాయి. గత ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్నాయని పలువురు బాధితులు నేటికి వాపోతున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రత్యేక దృష్టి సారించి న్యాయ విచారణ జరిపిస్తే అక్రమాలకు పాల్పడిన అధికారులు, అక్రమాలకు తెరలేపిన గత ప్రభుత్వ అధికార పార్టీ నాయకులకు తగిన బుద్ది చెప్పి అధికారులను గాడిలోకి తీసుకురావచ్చననే అభిప్రాయాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. మానకొండూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే ఇంతటి సాహాసానికి సిద్దపడి అక్రమార్కుల భరతం పడుతారా..?లేకా గతం గతః..నా హయాంలో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా సుపరిపాలన అందిస్తే సరిపోతుందని సర్దుకుపోతారా..?ప్రజలు వేచి చూడాల్సిందే.




అభివృద్ధి పనుల్లో దోపిడీ..?

గత ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో విచ్చలవిడిగా ప్రజాధనం దోపిడీకి గురైందని అయా రాజకీయ పార్టీల నాయకులు చెబుతున్నారు. బీఆర్ఎస్ నాయకులు అభివృద్ధి పనుల గుత్తేదారులుగా వ్యవహరించడం వల్ల మాముళ్ల మత్తులో అధికారుల పర్యవేక్షణ లేకా నాణ్యత లోపాలు తలెత్తి మన్నిక లేకుండా పోతున్నాయి. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ఆరోగ్య కేంద్రం, ఎంపీడీఓ కార్యలయం, మసీద్ ప్రాంతం వరకు నిర్మాణం పూర్తి చేసిన సీసీ రోడ్డుపై నాణ్యత లోపం తలెత్తి కంకర తెలుతోంది. దాచారం గ్రామంలో నిర్మించిన రైతు వేదిక గోడలు పగుళ్ళు ఏర్పడి ప్రమాదకంగా మారింది. నర్సింహుల పల్లిలో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనం పగుళ్ళ బారుతోంది. డంపింగ్ యార్డులు పూర్తి స్థాయిలో వినియోగించడం లేదు. హరితహారం కార్యక్రమంలో నాటిన మొక్కలపై శ్రద్ధ కరువైంది. క్రీడా ప్రాంగాణాలు వెలవెలబోతున్నాయి.

ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో వాటాలపర్వం..

గత ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల్లో నాయకులు వాటాలపర్వం సాగించారని వినికిడి. మండ ల కేంద్రంలో నిర్మించిన డబుల్ ఇండ్లలో అనర్హులను ఎంపిక చేసి పంపిణీ చేశారని..దళిత బంధు, బీసీ బంధు పథకంలో నాయకులు తమ అనుచరులకు ప్రాధాన్యత ఇస్తూ ఇతరుల వద్ద చేతివాటం ప్రదర్శించినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి



భూ పరిహారంలో అవకతవకలు..

మండల పరిధిలోని దాచారం గ్రామ శివారులోని 124 యందు ఎన్నో ఎళ్లుగా సాగుచేసుకుని పట్టాలున్న అసలైన రైతులకు పరిహారం అందుకోకపోవడంతో నిరాశ్రాయులైయ్యారు. మామూళ్లపర్వం సాగించి అధికారులు పట్టాలు లేని వారికి పరిహారం పంపిణీ చేశారనే విమర్శలున్నాయి. తోటపల్లి ఆన్ లైన్ రిజార్వాయర్ నందు ముంపునకు గురైన కొంతమంది లద్దబండ బాధితులకు నేటికీ ఆర్అండ్ఆర్ పరిహారం అందలేదు. వీరాపూర్ గ్రామంలో రిజర్వాయర్ యందు ముంపునకు గురవుతున్న రైతులు అవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేటికి అదే తంతు..

గత ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో అర్హులకు అన్యాయం జరిగిందని..ఇప్పుడైనా అర్హులకు పారదర్శకంగా న్యాయం జరుగుతోందని మరో నూతన ఎమ్మెల్యేను ప్రజలేన్నుకున్నారు. గతం కంటే అధ్వానంగా అధికార పార్టీ నాయకులు, అధికారులు వ్యవహరిస్తున్నారని విమర్శలు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికార పార్టీ నేతలు, అధికారులు ప్రజల్లో తలెత్తిన అపవాదును తగ్గించుకోవాలని పలువురు సూచిస్తున్నారు.

న్యాయవాదులు ఉత్సాహంగా పనిచేయాలి

- కుటుంబ తగాదా కేసులను సామాజిక స్పృహతో పరిష్కరించాలి
- హైకోర్టు జడ్జి, జిల్లా అడ్మినిస్ట్రేషన్ జడ్జి బి.విజయసేన్ రెడ్డి
- చేర్యాల పట్టణంలో కోర్టు ప్రారంభం



నవతెలంగాణ-చేర్యాల

ప్రజలకు సత్వర న్యాయం అందాలంటే న్యాయవాదులు ఉత్సాహంగా పనిచేయాలని హైకోర్టు జడ్జి, జిల్లా అడ్మిస్టేషన్ జడ్జి బి.విజయసేన్ రెడ్డి అన్నారు. చేర్యాల పట్టణంలో ఏర్పాటు చేసిన ఫస్ట్ క్లాస్ సివిల్ జూనియర్ కోర్టును శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేర్యాల, కొమరవెల్లి,దూలిమిట్ట, మద్దూరు మండలాల ప్రజలకు న్యాయ సేవలను అందించేందుకు బాధ్యతగా తాము చేర్యాల పట్టణంలో కోర్టును ఏర్పాటు చేశారని తెలిపారు. లాయర్ ఉద్యోగం చాలా స్వేచ్ఛతో కూడుకున్నదని, ప్రజలకు మంచి జరగాలంటే ఉత్సాహంతో పనిచేసి కోర్టు ద్వారా ఈ ప్రాంత ప్రజలకు కాలయాపన చేయకుండా న్యాయ సేవలు అందించాల్సిన బాధ్యత ఉందన్నారు. కోర్టు కేసుల పరిష్కారంలో నూతన టెక్నాలజీ చాలా ఉపయోగకంగా ఉంటుందని భవిష్యత్తులో ఆర్టిఫిషియన్ ఇంటెలిజెన్స్ కూడా న్యాయ వ్యవస్థలో కీలకపాత్ర పోషించనున్నదన్నారు. కుటుంబ తగాదాల కేసులను సామాజిక స్పృహతో పరిష్కరిం చాలని సూచించారు. సీనియర్ లాయర్లు జూనియర్ లాయర్లకు అవకాశాలు కల్పించి వారు వృత్తిపరంగా ఎదిగేలా ప్రోత్సహించాలని కోరారు. జిల్లా ప్రిన్సిపాల్, సెషన్స్ జడ్జి సాయి రమాదేవి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో న్యాయవ్యవస్థకు ప్రముఖ స్థానం ఉందని, ప్రాంత పౌరులకు సత్వర న్యాయ సేవలు అందించేందుకు చాలా ఉపయోగప డుతుందన్నారు. జిల్లా ఇంచార్జి కలెక్టర్ అబ్దుల్ హమీద్ మాట్లాడుతూ ఈ ప్రాంత దీర్ఘకాలిక అభివృద్ధికి ఈ కోర్టు ఏర్పాటు చాలా ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. సిద్దిపేట బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎస్. జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ 20 ఎండ్ల కల చేర్యాల్లో కోర్టు ఏర్పాటు అని దానిని సహకారం చేసినందుకు ధన్యవాదాలు అని తెలిపారు. ఈ సందర్భంగా జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యురాలు బాలలక్ష్మి లు హైకోర్టు జడ్జి, జిల్లా జడ్జిని పూల బోకే శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాసాధికారి సంస్థ ద్వారా దివ్యాంగులకు హైకోర్టు జడ్జి ఉపకరణాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా జడ్జి, సిద్దిపేట, జనగామ, గజ్వేల్, దుబ్బాక, మెదక్, నర్సాపూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు, సభ్యులు, న్యాయవాదులు, న్యాయశాఖ ఉద్యోగులు, ప్రజలు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వాహనదారున్నీ అభినందించిన ట్రాఫిక్ సీఐ

-వాహనదారున్ని శాలువాతో సన్మానించిన ఏఎస్ఐ

నవతెలంగాణ-గజ్వేల్ రూరల్



ప్రతి వాహనదారుడు పెండింగ్లో ఉన్న చాలన్లను స్వతహాగా వారే చెల్లించుకోవాలని గజ్వేల్ ట్రాఫిక్ ఏఎస్ఐ జగదీశ్వర్ అన్నారు. శనివారం గజ్వేల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో కట్టడం తో అతన్ని ఏఎస్ఐ జగదీశ్వర్ సన్మానించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ మురళి మాట్లాడుతూ వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ రోడ్డు నిబంధనలు పాటించాలని కోరారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా పోలీసులు వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆకర్షితుడైన గజ్వేల్ మండలం బెజగామా అతను తనంతట తను స్వచ్ఛందంగా గజ్వేల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ కు వచ్చి తన బైకు మీద ఉన్న 10 పెండింగ్ చాలన్లను(10/4145/-) చెల్లించడని పేర్కొన్నారు. తనంతట తాను వచ్చి చెల్లించినందుకు గజ్వేల్ ట్రాఫిక్ ఏఎస్ఐ జగదీశ్వర్, సిబ్బంది కలసి శాలువతో ఘనంగా సన్మానించారు. కరుణాకరును ఆదర్శంగా తీసుకొని పెండింగ్ చాలాన్‌లు కట్టుకోవాలని సూచించారు. వాహనదారులు పోలీసులు వాహనాలు ఆపినప్పుడు కాకుండా స్వచ్ఛందంగా వచ్చి పెండింగ్ చాలాన్స్ కట్టుకొని ఆదర్శంగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలను తప్పనిసరిగా పాటించాలి




నవతెలంగాణ-మద్దూరు

ప్రతి ఒక్కరూ రోడ్డు ప్రమాణాలను పాటిస్తే ప్రమాదాల నుంచి బయటపడవచ్చని, ప్రమాదాల నిర్మూలనకు సహకరించాలని మద్దూరు ఏఎస్ఐ విజయ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన దూల్మిట్ట, మండలంలోని బైరాన్ పల్లి ,గ్రామంలో సీపీ అనురాధ, మద్దూరు ఎస్సై షేక్ మహబూబ్, ఆదేశాల మేరకు జాతీయ రోడ్డు భద్రత మాసంలో భాగంగా వాహనదారులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క రూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఆయన కోరారు. హెల్మెట్ లేకుండా వాహనం నడపరాదని కోరారు. సీట్ బెల్ట్ ప్రతి ఒక్కరు పెట్టుకొని కార్ డ్రైవింగ్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు తదితరులున్నారు.

నవతెలంగాణ-దౌల్తాబాద్

వాహనదారులు ప్రయాణం చేసేటప్పుడు తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని దౌల్తాబాద్ ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్ దీప్ అన్నారు. శనివారం దౌల్తాబాద్ మండలం దొమ్మాట గ్రామంలో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలు రోడ్డు నిబంధనల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోటార్ సైకిల్ నడిపేటప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనం నడిపేటప్పుడు తప్పకుండా సీటు బెల్టు ధరించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సాయిలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిని పరామర్శించిన పలువురు


నవతెలంగాణ-దౌల్తాబాద్



మండలంలోని దౌల్తాబాద్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు, సినియర్ దళిత నాయకుడు కుటుంబ సభ్యులు మృతి చెందగా శనివారం డిబీఎఫ్ బృందం వారి కుటుంబ సభ్యులను పరామర్శించడం జరిగిందని డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పెద్దలింగన్నగారి శంకర్ అన్నారు. దౌల్తాబాద్ మండలంలోని తిర్మలాపూర్ గ్రామానికి చెందిన సినియర్ దళిత నాయకులు బండారు లాలు మాతృమూర్తి శుక్రవారం సాయంత్రం మృతి చెందారు. శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. లాలును పరామర్శించి వారి మాతృమూర్తి బండారు నర్సవ్వ మృతి బాధాకరమన్నారు. సూరంపల్లి గ్రామ తాజా మాజీ ఉపసర్పంచ్ బొల్లం స్వామి తల్లి రాజవ్వ, అదె గ్రామానికి చెందిన దళిత నాయకుడు తెలంగాణ ఉద్యమకారులు ప్రజా కళాకారుడు గంగధారి ప్రభాకర్ మృతి చెందడంతో ఆయా కుటుంబాలను పరామర్శించి సంతాపాన్ని ప్రకటించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ మనో ధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఎగొండ స్వామి, జిల్లా నాయకులు పి.కిరణ్, బొల్లం యాద గిరి, మనకిబాత్ కన్వీనర్ ముత్యాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పరామర్శించిన శ్రీనివాస్ రెడ్డి.. దౌల్తాబాద్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు బండారు లాలు దుబ్బాక కాంగ్రెస్ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి పరామర్శించారు. శనివారం మండలంలోని తిరుమలపూర్ గ్రామంలో బండారు లాలు మాతృమూర్తి మృతిచెందగా ఆమె మృతదేహానికి పూలమాలవేసి చెరుకు శ్రీనివాస్ రెడ్డి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దౌల్తాబాద్ మండల పరిధిలోని తిరుమలాపూర్ గ్రామానికి చెందిన మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు బండారు లాలు మాతృమూర్తి అనారోగ్యంతో శుక్రవారం సాయంత్రం మృతి చెందింది. శనివారం విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గం ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి మృతదేహం వద్ద నివాళులర్పించారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ అధ్యక్షులు పడాల రాములు, నాయకులు దశరథ రెడ్డి, మల్లారెడ్డి, మద్దెల స్వామి, తలారి నర్సింలు సాయికిరణ్, ఉన్నారు.

గడువు దగ్గరకు.. లెక్కలపై దృష్టి





నవతెలంగాణ-గజ్వేల్

మున్సిపాలిటీల పాలకవర్గం పదవి కాలం జనవరి 26తో ముగియనున్న నేపథ్యంలో కౌన్సిల్ సభ్యులు పెండింగ్ బిల్లులపై దృష్టి పెట్టారు. దీంతో గజ్వేల్ ప్రజ్ఞాపూర్, చేర్యాల, దుబ్బాక, హుస్నాబాద్ మున్సిపల్ పాలకవర్గాలు ఐదు ఏండ్లుగా చేసిన అభివృద్ధిపై చర్చ కొనసాగిస్తున్నారు. అయితే గత ఏడాది కాలంగా మున్సిపల్ కార్యాలయాల్లో పెండింగ్ బిల్లులు ఆయా కౌన్సిల్ సభ్యులకు రావాల్సి ఉండగా సమయం దగ్గర పడుతుంది. పదవి ముగిసిన తర్వాత కౌన్సిల్ సభ్యులకు పవర్ తగ్గిపోయి, స్పెషల్ అధికారి పరిపాలన రానున్న నేపథ్యంలో ఆ లోపే పెండింగ్లో ఉన్న బిల్లులను మంజూరు చేసుకోవాలని ప్రయత్నం చేస్తున్నారు. జిల్లాలో నాలుగు మున్సిపాలిటీలో మొత్తం 72 మంది కౌన్సిల్ సభ్యులు ఉండగా 16 మంది కో ఆప్షన్ సభ్యులు త్వరలో మాజీలు కానున్నారు.

కొత్త పనులు చేయొద్దు.. పాత బకాయిలు వదలొద్దు..

కొత్త పనులు ఇక చేయవద్దని పాత బకాయిలను విడిచే ప్రసక్తి లేదని కౌన్సిల్ సభ్యులు పట్టుబడుతున్నారు. అధికారంలో మాత్రం కాంగ్రెస్ పార్టీ ఉండటం వల్ల ప్రస్తుతం ఎక్కువ శాతం అప్పటి అధికార పార్టీ చెందిన చైర్మెన్, వైస్ చైర్మెన్, కౌన్సిల్ సభ్యులు ఉన్నారు. పదవి కాలం పోతే మున్సిపల్‌లో బిల్లులన్నీ పెండింగ్లో పెట్టాలని ప్రస్తుతం ప్రభుత్వం భావిస్తోందని, దీంతో అధికార పార్టీకి చెందిన నాయకుల ద్వారా ఒత్తిడి వచ్చే అవకాశం ఉందని తెలుస్తుంది. దీని దృష్టిలో పెట్టుకొని పాలకవర్గం హడావుడిచేస్తుంది. గడిచిన 5 ఏండ్ల కాలంలో ఆయా మున్సిపాలిటీలో చేపట్టిన సీసీ రోడ్లు, మురుగు కాలువలు, కమ్యూనిటీ భవనాలు, ఇతర అభివృద్ధి పనులకు కౌన్సిల్ సభ్యులు తమ సొంత డబ్బులను కేటాయించి పనులు పూర్తి చేశారు. ఒక్కొక్క మున్సిపాలిటీలో భవనాలను నిర్మించారు. అంతేకాకుండా ఆయా వార్డులో నిర్మిస్తున్న ఇంటి నిర్మాణాలకు కౌన్సిల్ సభ్యులు చేతి చాపుతు, అనుమతులు తీసుకొస్తామని పెద్ద ఎత్తున ఇంటి యజమాని వద్ద డబ్బులకు ప్రాధే పడుతున్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో బిల్లుల పరిస్థితి అధ్వానంగా ఉంది.

ఇక కాంట్రాక్టర్లకు కోట్లలో...

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో చేపట్టిన సీసీ రోడ్లకు కాంట్రాక్టర్లకు డబ్బులు భారీగా రావాల్సి ఉంది. రూ.కోట్ల మున్సిపాలిటీలో బిల్లులు పెండింగ్లో ఉన్నాయి. ఆన్లైన్ టెండర్ ద్వారా సీసీ రోడ్లను దక్కించుకున్న కాంట్రాక్టర్లు కొంతవరకు పనులు చేపట్టిన కొంతవరకే బిల్లులు వచ్చి మిగతా బిల్లులు పెండింగ్లో ఉన్నాయి. దీనిపై కూడా తర్జనభజన నాయకులు మధ్య కొనసాగుతున్నట్టు తెలుస్తుంది.

మున్సిపాలిటీల్లో..

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో 20 వార్డులు ఉండగా నలుగురు కో ఆప్షన్ సభ్యులు ఉన్నారు. హుస్నాబాద్‌లో 20 వార్డులు ఉండగా నలుగురు కో ఆప్షన్ సభ్యులు ఉన్నారు. చేర్యాలలో 12 వార్డులు ఉండగా నలుగురు కో ఆప్షన్ సభ్యులు ఉన్నారు. దుబ్బాకలో 20 వార్డులు ఉండగా నలుగురికి ఆప్షన్ సభ్యులు ఉన్నారు. వీరి పదవి కాలం ఈనెల 26 తో ముగుస్తుంది. ఇది ఇలా ఉండగా సిద్దిపేట జిల్లాలో సిద్దిపేట మున్సిపాలిటీకి 2026 వరకు పదవీకాలం ఉంటుంది.